

## వృద్ధుల సేవకు మనుషులు కావలెను



ఆంధ్రజ్యోతి సండే స్పెషల్

'మీకు డబ్బులు ఎంతైనా ఇస్తాం. భోజనం, వసతి కల్పిస్తాం. మా ఇంటికే వచ్చి, 78 ఏళ్ల అమ్మను కనిపెట్టు కుని ఉండాలి. ఆమె ఏ పనులు చేసుకోలేదు. కంటికి రెప్పలా కాపాడుతూ అవసరాలు తీర్చాలి' అంటూ అద్దె మనుషుల కోసం ఇప్పుడు అన్వేషణ కొనసాగుతోంది. కాస్త డబ్బుంటే చాలు.. తల్లిదండ్రులకు సేవలు అందించేందుకు వీలుగా నెలకు రూ.30 నుంచి 40 వేలు చెల్లించి మరీ ఆడ, మగ మనుషులను అందుబాటులోకి తీసుకుంటున్నారు. మంచం పట్టి లేవ లేని వారికి సపర్యలు చేస్తూ 24 గంటలు వారితోనే ఉండేలా చూస్తున్నారు. వీరిపై ఆదివారం ప్రత్యేక కథనం. 6లో..



పుష్పాలతో శ్రీ వేంకటేశ్వరుడు..

భీమవరంలో దేదీప్యమానంగా కార్తీక దీపోత్సవం 6

## 94.61 శాతం పింఛన్ల పంపిణీ

భీమవరం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 94.61 శాతం పూర్తయ్యింది. వాస్తవంగా పెన్షన్లు ఒకటో తేదీన పంపిణీ చేయాల్సి వుండగా ఆ రోజు ఆదివారం రావడంతో ఒకరోజు ముందే శనివారం లబ్ధిదారులకు అందించా రు. వాతావరణం అనుకూలంగా లేనప్పటికీ సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్వయంగా పెన్షన్‌లను అందించారు జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి భీమవరం మండలం నాగిడిపాలెంలో మత్స్యకారులకు పెన్షన్ల ను అందించి వారి వివరాలను అడిగితెలుసుకున్నారు. జిల్లాలో రెండు లక్షల 28 వేల 362 మంది లబ్ధిదారులకు శనివారం రాత్రి ఏడు గంటల సమయానికి 2,16,053 మందికి పెన్షన్లు అందించారు. 94.61 శాతం నమోదైంది. ఇంకా 12 వేల 310 మంది లబ్ధిదారులకు పెన్షన్ అందించాల్సి ఉంది.



వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న జేసీ రాహుల్

| మండలం | మొత్తం పింఛన్లు | పంపిణీ | మిగిలినవి | శాతం |
|---|---|---|---|---|
| ఆకివీడు అర్బన్ | 3,221 | 2,848 | 373 | 88.19 |
| ఆచంట | 8,050 | 7,520 | 530 | 93.20 |
| వీరవాసరం | 8,563 | 8,003 | 560 | 93.46 |
| యలమంచిలి | 10,267 | 9,614 | 653 | 93.64 |
| పెనుగొండ | 8,703 | 8,162 | 541 | 93.78 |
| కాళ్ళ | 8,778 | 8,235 | 543 | 93.81 |
| ఉండి | 8,763 | 8,225 | 538 | 93.86 |
| ఆకివీడు | 5,363 | 5,036 | 327 | 93.90 |
| నరసాపురం | 11,054 | 10,390 | 664 | 93.99 |
| పాలకోడేరు | 9,168 | 8,636 | 532 | 94.20 |
| పెనుమంట్ర | 8,219 | 7,751 | 468 | 94.31 |
| మొగల్తూరు | 10,586 | 10,002 | 584 | 94.48 |
| భీమవరం | 11,312 | 10,693 | 619 | 94.53 |
| పెంటపాడు | 9,734 | 9,216 | 518 | 94.68 |
| నరసాపురం(అర్బన్) | 5,685 | 5,384 | 301 | 94.71 |
| గణపవరం | 8,671 | 8,213 | 458 | 94.72 |
| పోడూరు | 8,539 | 8,103 | 436 | 94.89 |
| తణుకు | 8,874 | 8,443 | 431 | 95.14 |
| భీమవరం(అర్బన్) | 11,098 | 10,574 | 524 | 95.28 |
| ఇరగవరం | 9,359 | 8,926 | 433 | 95.37 |
| పాలకొల్లు | 9,023 | 8,610 | 413 | 95.42 |
| తాడేపల్లిగూడెం(అర్బన్) | 9,177 | 8,759 | 418 | 95.45 |
| అత్తిలి | 9,427 | 9,010 | 417 | 95.58 |
| పాలకొల్లు(అర్బన్) | 5,846 | 5,603 | 243 | 95.84 |
| తాడేపల్లిగూడెం | 12,485 | 11,992 | 493 | 96.05 |
| తణుకు (అర్బన్) | 8,397 | 8,104 | 293 | 96.51 |
| మొత్తం | 2,28,362 | 2,16,053 | 12,310 | 94.61 |

# కుండపోత

## వర్షంతో.. రైతుల అవస్థలు

- నిలిచిన సార్వా మాసూళ్లు
- ధాన్యం తరలింపు యత్నాలు
- పంటను కాపాడేందుకు అవస్థలు

భీమవరం రూరల్/నరసాపురం రూరల్/మొగల్తూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో శనివారం జిల్లాలో ఏకధాటిగా వర్షం పడడంతో సార్వా మాసుళ్లు స్తంభించాయి. కొన్నిచోట్ల వర్షంలోనే ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు పరుగులు పెట్టారు. మరోపక్క ధాన్యం రాశుల్లోకి వర్షపు నీరు వెళ్లిపోవడంతో వాటిని వేరే చోటికి మార్చి బరకాలతో భద్రపరిచారు. ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా పంట చేలు నేలనంటాయి. జిల్లాలో లక్షా 20 వేల ఎకరాల వరకు మాసుళ్లు చేయాల్సి ఉండగా వర్షానికి చాలా చేలు నేలనంటాయి. వర్షం అధికంగా నమోదైతే పంటపై వర్షపు నీరు చేరి దెబ్బ తినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కారణంగా కోత యంత్రాలకు ఎక్కువ సొమ్ము చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. సాపీగా సాగుతున్న పంట మాసుళ్ల వాయుగుండం, వర్షాలతో పడకేశాయి. పంట మాసుళ్ల ఆలస్యానికి దారి తీశాయి. జిల్లావ్యాప్తంగా మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. చాలా ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. వర్షాలకు చల్లగాలులు తోడయ్యాయి. చలికి ప్రజలు వణికిపోయారు. నరసాపురం మెయిన్‌రోడ్, స్టీమర్ రోడ్, రైల్వేస్టేషన్, కనకదుర్గా ఆలయం వద్ద మోకాలు లోతు నీరు నిలిచింది. పాలకొల్లు వారపు సంతకు వినియోగదారులు తక్కువగా రావడంతో వ్యాపారులు డీలా పడ్డారు.



ఆచంటలో ధాన్యం రాశులు తడవకుండా బరకాలు కప్పిన రైతులు



వర్షంలో సరుకులు తడవకుండా బరకాలు కప్పి చిరు వ్యాపారి



గణపవరంలో నేలనంటిన వరి పనలు..



భీమవరంలో ధాన్యాన్ని ట్రాక్టర్లపై రైస్‌మిల్లులకు తరలింపు

### ఎగసిపడుతున్న కెరటాలు

తుఫాన్ ప్రభావంతో శనివారం సముద్ర తీరంలో భారీ వర్షాలు కురిశాయి. గోదావరి, సముద్రంలో వేట లేకపోవడంతో మత్స్యకారులకు రెండు రోజులుగా ఉపాధి లేదు. చాలామంది ఇంటికే పరిమితమయ్యారు. శనివారం రాత్రి నుంచి సముద్రం అల్లకల్లోలంగా మారింది. పీఎం లంక వద్ద పది మీటర్ల వరకు ముందుకు చొచ్చుకురావడంతో గట్టు కోతకు గురవుతోంది. అధికారులు అప్రమత్తమై సముద్రతీరానికి సందర్శకులను అనుమతించడం లేదు. ఆదివారం పేరుపాలెం బీచ్‌కు వచ్చే పర్యాటకులను అనుమతి లేదని తహసీల్దార్ కె.రాజ్‌కిశోర్, ఎస్ఐ జి.వాసు తెలిపారు.

## కృష్ణా రైతుల ధాన్యం కొనండి : జేసీ

భీమవరం రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలంగా లేని కారణంగా కృష్ణా జిల్లా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి మానవతా దృక్పథంతో ఆదుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా రైస్ మిల్లుల యజమానులను జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి కోరారు. శనివారం కలెక్టరేట్‌లో మిల్లర్లు, అధికారులతో సమీక్ష జరిపారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రతీ రైస్ మిల్ నుంచి రెండు వాహనాలను కృష్ణా జిల్లాకు పంపించాలని కోరారు. భారీ వర్షాల కారణంగా వరి కోతలను కొన్ని రోజులు వాయిదా వేయాలన్నారు. కల్లాల్లో వున్న ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు లేదా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ టి.శివరామప్రసాద్, పశ్చిమ గోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

## లైంగిక చట్టాలపై అవగాహన కల్పించాలి



భీమవరం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బాలలు, మహిళలకు లైంగిక చట్టాలపై అవగాహన కలిగించి, పటిష్ఠంగా అమలుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శనివారం కాస్మోపాలిటిన్ క్లబ్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలలు, మహిళలు అత్యాచార నిరోధక చట్టాలపై అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. 'పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో జరిగే లైంగిక దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. పురుషులకు సమానంగా స్త్రీలు అనే నినాదం కొనసాగుతున్న వేళ పురుషులకంటే స్త్రీలు మరింత ఎక్కువగా పనిచేయాల'ని కోరారు. డీఎంహెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు మాట్లాడుతూ ఆడ, మగ తేడా లేని సమాజ నిర్మాణం జరగాలన్నారు. డీఈవో ఇ.నారాయణ మాట్లాడుతూ పాఠశాలల్లో, బహిరంగ ప్రదేశాల్లో పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగించాలన్నారు. కార్మిక శాఖ అధికారి ఏ.లక్ష్మి, అగ్ని మాపక నిరోధక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, డాక్టర్ ఆర్.ఎస్ కుమారేశ్వరన్, బి.సుజతారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రుల్లో ఏదీ శుభ్రత



ఈ చిత్రం తణుకు ప్రభుత్వాసుపత్రి ఆవరణలోది. ఇక్కడ వైద్య సేవలు మెరుగ్గా ఉన్నప్పటికీ.. పారిశుధ్యం మాత్రం తీసికట్టుగా వుంది. ఇలాంటి పరిస్థితే మిగిలిన ఏరియా ఆసుపత్రుల్లోనూ కనిపిస్తోంది. వివరాలు 7లో

## రేషన్ బియ్యానికి బదులు రాగులు తీసుకోవచ్చు

ఉండి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల ఒకటో తేదీ ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ఇంటింటికి రేషన్ సరఫరా చేసేందుకు సరుకులను అధికారులు సిద్ధం చేశారు. జిల్లాలో ఐదు లక్షల 67 వేల 650 కార్డుదారులకు ఎనిమిది వేల 700 మెట్రిక్ టన్నుల బియ్యంను సరఫరా చేసింది. వీటిని కార్డుదారులకు ఉచితంగా సరఫరా చేస్తారు. అర కేజీ పంచదార ప్యాకెట్ రూ.17లకు, కేజీ కందిపప్పు రూ.67లకు విక్రయిస్తారు. ఈ నెలలో కార్డుదారులకు రాగులను అందించనుంది. కార్డుదారులు బియ్యం వద్దనుకుంటే వాటి స్థానంలో రాగులు తీసుకోవచ్చు.



పౌరాణిక నాటకానికి చక్రవర్తి

నేడు షణ్ముఖి ఆంజనేయ రాజు జయంతి -6లో

## నేటితో ముగియనున్న కార్తీకం

### సోమవారం పోలిస్వర్గం..పాడ్యమి దీపాలు

పవిత్రమైన కార్తీక మాసం ఆదివారంతో ముగియనుంది. ఆదివారం ఉదయం అమావాస్య ఉండటంతో కార్తీకమాసం పూర్తి అవుతుంది. అవకాశం ఉన్నవారు కార్తీక మాసం నెలరోజులు చేసినట్టుగానే సోమవారం తెల్లవారుజామున నదీ లేదా కాల్వ స్నానం చేయాలి. అరటిదొప్పలో దీపాలు వెలిగించి నీటిలో ఆ దీపాలు వదలాలి.. ఇలా చేస్తే కార్తీకమాసం అంతా తెల్లవారుజామున నదీస్నానమాచరించిన ఫలితం దుక్కుతుందని పండితులు చెబుతున్నారు. తర్వాత శివాలయం, వైష్ణవాలయాలను దర్శించాలి.. ఇంటి పురోహితునికి లేదా బ్రాహ్మణుడికి ఉసిరికాయపై ఆవు వత్తి దీపంతో దానం చేయాలి.. స్వయపాకం దానం ఇవ్వాలి.. స్త్రీలు పోలిస్వర్గం నోము పూర్తిచేసుకుని సోమవారంతో కార్తీక మాస దీక్షను విరమించుకుంటారు.







### దేదీప్యం.. కార్తీక దీపోత్సవం

భీమవరం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం శనివారం జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ అర్చకుడు వాడపల్లి ఆదినారాయణాచార్యులు స్వామి వారికి, అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు వంశపారపర్య ధర్మకర్త మంతెన రామ్‌కుమార్ రాజు దీపాలను వెలిగించారు. దీపాల కాంతుల్లో ఆలయం కొత్త శోభను సంతరించుకుంది. వేంకటేశ్వరస్వామి, శంకు, చక్రం పలు ఆకారాల్లో దీపాలను వెలిగించారు.



## నిరంతర సాధనే విజయానికి సూచిక

### అంతర్జాతీయ క్రీడలే లక్ష్యం కావాలి : కలెక్టర్ వెట్రిసెల్వి

### ముగిసిన గురుకుల విద్యాలయాల రాష్ట్రస్థాయి పోటీలు

పెదవేగి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనడమే ధ్యేయంగా సాధన ఉండాలని, అప్పుడే ఆశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి మార్గం సుగమం అవుతుందని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. పెదవేగి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో మూడురోజులపాటు నిర్వహించిన ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతివిద్యార్థి విద్యతోపాటు క్రీడలకు సమప్రాధాన్యం ఇవ్వాలని, పాఠశాల స్థాయి నుంచే సాధన చేస్తేనే అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. క్రీడలతో వ్యక్తిత్వ వికాసంతో పాటు పట్టుదల, క్రమశిక్షణ, పోటీతత్వం అలవడుతాయని చెప్పారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఏపీ సాంఘుక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ అకడమిక్ మోనటరింగ్ అధికారులు ఎన్.సంజీవరావు, ఎ.మురళీకృష్ణ, బీవీ.మల్లేశ్వర రావు, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల సమన్వయాధికారులు ఎన్.భారతి, కె.ప్రేమావతి, పెదవేగి గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ అధికారి కె.జయరాజు, నాలుగు జోన్లకు చెందిన పీడీలు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న నృత్య, బ్యాండ్ ప్రదర్శనలు







బహుమతులు అందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

#### విజేతలకు నగదు బహుమతి

విజేతలకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి బహుమతులు అందించారు. బాలుర జూనియర్స్ స్పోర్ట్స్ విభాగంలో వ్యక్తిగత ఛాంపియన్‌గా జి.నరేంద్రకుమార్ (కురుబేడు, జోన్-3), సీనియర్స్ విభాగంలో జి.జశ్వంత్ (రామకుప్పం, జోన్-4) రూ.10 వేలు నగదు బహుమతి అందుకున్నారు. బాలికల జూనియర్స్ విభాగంలో కె.అశ్విని (వెల్లల, జోన్-4), సీనియర్స్‌లో వి.పరిమళ (సూళ్ళూరుపేట, జోన్ -3) వ్యక్తిగత ఛాంపియన్లుగా రూ.10 వేలు నగదు బహుమతులను కలెక్టర్ చేతులమీదుగా అందుకున్నారు. స్పోర్ట్స్ గేమ్స్ ఆల్ రౌండ్ విభాగంలో బాలికల జూనియర్స్ ఛాంపియన్ షిప్‌ను జోన్ -4 మొదటిస్థానం సాధించగా, జోన్- 3 ద్వితీయస్థానంలో నిలిచింది. సీనియర్స్ జోన్ -1 ప్రథమ, జోన్- 4 ద్వితీయస్థానాలు సాధించారు. బాలుర జూనియర్స్‌లో జోన్-4 ప్రథమ, జోన్ -3 ద్వితీ యస్థానాలు సాధించారు. సీనియర్స్ విభాగంలో జోన్ -4 ప్రథమస్థానం సాధించగా, జోన్ -1 ద్వితీయస్థానంలో నిలిచారు.

## బండి ముత్యాలమ్మను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

మొగల్తూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముత్యాపల్లిలో బండి ముత్యాలమ్మని హైకోర్టు జడ్జి కె.సురేష్‌రెడ్డి, విశ్రాంత జడ్జి ఏ.వి శేషసాయిలు శనివారం సాయంత్రం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో మోకా అరుణ్ కుమార్, ఆలయ సిబ్బంది పాలకవర్గ చైర్మన్ కడలి మాణిక్యాలరావులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వారి వెంట నరసాపురం బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం పేరుపాలెం సాగర తీరానికి వెళ్ళి అక్కడ రిసార్ట్స్‌లో బస చేస్తారు.



హైకోర్టు జడ్జి కె.సురేష్ రెడ్డి, విశ్రాంత జడ్జి శేషసాయిలను ఆశీర్వదిస్తున్న అర్చకులు

## ఎంఏ ఎకనామిక్స్‌లో సరస్వతికి గోల్డ్‌మెడల్

ద్వారకాతిరుమల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేరుకు తగ్గట్టు చదువులో ఆమె సరస్వతి.. పీజీలో గోల్డ్ మెడల్ సాధించింది. తమిళనాడు రాష్ట్రం తిరువాయూర్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్ ఫస్ట్ ర్యాంక్‌లో గోల్డ్ మెడల్ సాదించింది. శనివారం యూనివర్సిటీ ఛాన్సలర్ గోవిందరాజన్ పద్మనాభన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ తీసుకుంది. ఈమె పేరు తైదల సరస్వతి ప్రవల్లిక. మండలంలోని కొమ్మర గ్రామంలో నివాసం. చిన్నప్పటి నుంచి చదువుపై ఆసిక్తి. 5 వరకూ ద్వారకాతిరుమల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో , 10వరకూ బుట్టాయిగూడెం గురుకులంలో చదివింది. పీజీ సెంట్రల్ యూనివర్సిటీలో చదివి గోల్డ్ మెడల్ సాధించింది. తండ్రి మండలంలోని పంగిడిగూడెంకు చెందిన తైదల శ్రీనివాసరావు నాలుగేళ్ల క్రితం మృతి చెందగా తల్లి ఇందిర కుమారి కుమార్తెను కష్టపడి చదివించారు.



యూనివర్సిటీ చాన్సలర్ నుంచి గోల్డ్ మెడల్

## ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అక్షర

మండవల్లి నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మండవల్లి గ్రామానికి చెందిన పసుపులేటి అక్షర తన ప్రతి భతో చోటు దక్కించుకుంది. మండవల్లికి చెందిన పసుపులేటి శివకృష్ణ, లక్ష్మీప్రసన్న దంపతులు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు. వారి ఏకైక పుత్రిక అయిన పసుపులేటి అక్షర చిన్నప్పటి నుంచి అసమాన ప్రతిభ కనబరిచేది. ఇంటి వద్దనే కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఆసక్తి చూపేది. దీంతో చిన్నారి ఆసక్తిని గమనించిన పాప పిన్ని శ్యామల పాఠ్య విషయాలతో పాటు ఆధ్యాత్మిక అంశాల్లోనూ శిక్షణ ఇచ్చేది. భగవద్గీతలోని శ్లోకాలు చెప్పడం, మంత్రపుష్పం , యూకేజీలో ఉన్నప్పుడే భారతదేశంలోని రాష్ట్ర ,కేంద్రపాలిత ప్రాంతాలు వాటి రాజధానులను కేవలం 40 సెకన్లలోనే చెప్పడం, అబాకస్‌లో సైతం మంచి ప్రతిభను కనబరిచడం వంటి వాటిని గమనించిన పాఠశాల యాజమాన్యం పాపను పై తరగతికి ముందుగానే ప్రమోట్ చేయడంతో పాప ప్రస్తుతం మూడో తరగతి చదువుతోంది. రసాయనశాస్త్రంలోని ఆధునిక పిరియాడిక్ టేబుల్‌లోని 118 మూలకాలను నిమిషంలోపు పఠించేలా శిక్షణ ఇచ్చారు. పాప వాటిని కేవలం 55 సెకన్లలోనే చెబుతుంది. ఈ విషయాన్ని "ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్" వారి దృష్టికి తీసుకువెళ్లగా వారు పరిశీలించి ఒక రికార్డుగా గుర్తించి ఐబీఆర్ అచీవర్ (ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అచీవర్) అవార్డు, మెడల్, సర్టిఫికెట్ ప్రదానం చేశారు.




(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్



# కిరాయి బంధువులు

- మంచాన పట్టిన పెద్దలకు వీరే దిక్కు
- మారుతున్న కాలంలో సరికొత్త పోకడ
- నెలవారీ సొమ్ము చెల్లిస్తే సపర్యలు..
- ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నంతో వృద్ధులు విలవిల
- ఆఖరి క్షణాల్లో అయినవారు దూరం
- బంధువులు, స్నేహితుల పాత్ర అంతంత మాత్రమే
- చివరిలో అద్దె మనుషులే ఆధారం

ఒకప్పుడు ఎవరైనా ఇంట్లో మంచానపడితే ఏమైనా రోగాల బారిన పడితే వారి ఆలనా పాలనా చూసేందుకు కుటుంబంలో ఎవరో ఒకరు బాధ్యత భుజానకెత్తుకునే వారు. బంధు వులు, స్నేహితులు వచ్చీపోయే వారంతా ధైర్యం నూరి పోసేవారు. అస్వస్థత నుంచి పూర్తిగా బయట పడేంత వరకు ఇదంతా మా కర్తవ్యం అనేలా సేవలందించేవారు. కానీ రోజులు మారాయి. మనస్తత్వాలు మారాయి. రోజువారీ పని ఒత్తిడి ఇంకాస్త పెరిగింది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. ఎవరైనా మంచం పడితే చూసేవారే కరువయ్యారు. పల్లె, పట్నం తేడా లేకుండా అన్నింటా ఏదో తెలియని ఆవేదన..అద్దె మనుషులే ఇప్పుడు అన్నింటికీ ఆధారం.

### ఎందుకిలా జరుగుతుంది

కుటుంబ వ్యవస్థలో ఏ రోజుకారోజు మార్పులు, చేర్పులు. ఒకప్పటి ప్రశాంత వాతావరణం చెదిరిపోయింది. ఉరుకులు, పరుగుల జీవనం. తెల్లవార్లూ నిద్రలేకుండా ఒత్తిడికి గురయ్యేవారు కొందరైతే కాలక్షేపంగా నెట్‌లో మునిగిపోయేవారు ఇంకొందరు. దురదృష్టవశాత్తు అనారోగ్యంతో ఎవరైనా మంచాన పడితే ఇక అప్పటి నుంచి కష్టాలు ఆరంభమే. ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇళ్ళల్లోనే నెలల తరబడి విశ్రాంతి తీసుకోవాలి. కాలు, చెయ్యి కదపలేని పరిస్థితిలో వారికి సేవలు అందించేందుకు ఎవరో ఒకరు నిత్యం తోడుకావాల్సిందే. ఇప్పుడు అలాంటి పరిస్థితుల్లో అత్యధికులు వృద్ధులే ఉంటారు. వయసుపైబడి తీవ్ర అనారోగ్యంతో దేవుడి పిలుపు కోసం ఎదురుచూస్తూ మంచాన పట్టిన వారికి కనీసం సేవలు అందించడం ఇప్పుడు ఆయా కుటుంబాల్లో ఒక పెద్ద టాస్క్. ఇంట్లో ఉన్న మహిళలతో పాటు మిగిలిన వారికి రోజూ ఏదొక పని ఉండే ఉంటుంది. రోగి వద్దే అంటిపెట్టుకుని కూర్చోవడం, వారికి సపర్యలు చేయడం అత్యంత దుర్లభం. ఇలాంటి పరిస్థితులు ఒకనాడు ఏ కుటుంబంలో తలెత్తినా రక్తబంధువుల్లో ఎవరో ఒకరు కలుగచేసుకుని వచ్చి వాలిపోయేవారు. రోజుల తరబడి వారికి దగ్గరుండి మరీ సేవలు అందించేవారు. ఎటువంటి బేషజాలకు పోయేవారుకాదు. కాని ఇప్పుడు మాత్రం అలాంటి పరిస్థితులు కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో మంచాన పట్టిన మనిషికి ఇంట్లో ఏ హోదా ఉన్నా సరే పూర్తి సేవలు అందించేందుకు ఏ ఒక్కరూ రోజుకింత సమయం కేటాయించలేని విపత్కర పరిస్థితి. త్వరలోనే కోలుకుంటారు..ఏం పర్వాలేదని కనీసం ధైర్యవచనాలు పలికే వారు కూడా కరువయ్యారు. పిల్లలు ఒకచోట, పెద్దలు ఇంకొకచోట ఒంటరిగా ఉంటున్న కుటుంబాల్లోని వారికైతే అత్యంత దుర్భర పరిస్థితి. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా మూడో వ్యక్తికి చెప్పుకోలేనంత కష్టం. కనీసం ఓదార్పు మాటలకు అల్లంత దూరం. మంచం పట్టినా, ఆసుపత్రులపాలైనా తోడుగా ఉండేవారి కోసం వెతుకులాట. నాలుగైదు రోజులొచ్చి సాయ పడంటంటూ బంధువుల దగ్గర నుంచి స్నేహి తుల వరకు వేడుకోలు. అయినా అందరూ బిజీ బిజీ. మాట వరుసకే తప్ప ఏ ఒక్కరూ నేరుగా వచ్చి చేయి అందించలేనివారే. ఆఖరుకి తోబు ట్టువులైనా, రక్త సంబంధీకులైనా, అత్యంత దగ్గర వారైనా అందరిదీ ఒకటే మాట..బిజీ..బిజీ.

"తినడానికి ఉండడానికి లోటు లేదు. ఇప్పుడు వయస్సు పైబడి మంచాన పట్టాం. మా పని మేం చేసుకోలేకపోతున్నాం. పిల్లలు ఎక్కడో దూరంగా ఉంటున్నారు. రోజువారి కనీసం మాత్రలు వేసుకోవడానికి సాయపడేవారు లేకుండా పోయారు. పిల్లలకు ఈ విషయం చెబితే మేం రాలేంగాని ఓ మనిషిని మీకోసం పెడతున్నామంటున్నారు. అలాగే ఎవరో మొక్కుమొఖం తెలియని మనిషిని మా వద్దే ఉంచుతున్నారు. రోజంతా వారే దిక్కు. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా ఒకనాడు మనస్సువిప్పి మాట్లాడుకునేవాళ్ళం. కాని ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. మనసులో బాధ ఎవరికి చెప్పుకోవాలి...ఏలూరుకు చెందిన సత్యనారాయణ అనే వయోవృద్ధుడి ఆవేదన ఇది.



ఉన్నా లేకపోయినా మంచం పట్టిన వారిని ఆలనా పాలనా చూసుకునేందుకు ఏలూరు నగరంతో పాటు అనేక ప్రాంతాల్లో ఇప్పుడు కొంతమంది 'సేవ'లకు వీలు కల్పిస్తున్నారు. అసలు కదలలేని స్థితిలో ఉన్నవారికైతే వారి వ్యవహారాలన్నింటిని చక్క బెట్టేందుకు నెలకు 25 వేల నుంచి 35 వేల రూపాయలు చెల్లించగలిగితే ఆడ లేదా మగ మనిషిని అందుబాటులో తెచ్చేందుకు ఇప్పుడిప్పుడే కొందరు ముందుకొస్తున్నారు. ఏలూరులో సైతం ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. "వృద్ధాప్యమంటూ వస్తే మూడో కంటికి తెలియకుండా కన్నుమూయాలి. అంతేతప్ప మంచానపట్టి బతుకీడ్చుకురావడం మాత్రం అత్యంత దారుణం. పగవాడికి ఈ పరిస్థితి రాకూడదు" అన్నపూర్ణ అనే వృద్ధురాలి ఆక్రోశమిది.

### అద్దెకు.. మనుషులు

మారుతున్న కాలంతో పాటే కుటుంబ వ్యవహారాలు మార్చుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు తలొక చెయ్యి వేసి కష్టాల కడలిలో ఉన్న వారిని ఒడ్డుకు లాగేవారు. మంచాన పడితే స్వస్థత చేకూరేంత వరకు వదిలిపెట్టేవారే కాదు. ఆఖరుకి ఎంత కష్టమైనా సరే నెలల తరబడి తమకు అయిన వారి దగ్గరే సేవలు అందిస్తూ ఇంటి ముఖం చూడని బంధువులు ఎంత మందో ఉన్నారు. కాని రానురాను పరిస్థితులు తలకిందులవుతున్నాయి. ఇలాంటి ఆలోచనల స్థానంలోనే అద్దె మనుషులు పుట్టుకొచ్చారు. ఎక్కడైనా తల్లిదండ్రులు వృద్ధాప్యంతో మంచానపడితే వారి ఆలనపాలనా చూసే సమయం లేక బిడ్డలంతా బిజీబిజీగా మారారు. తమవారి కోసం అద్దె మనుషులను కొని తెచ్చుకుంటున్నారు. తల్లిదండ్రులకు సేవలు అందించేందుకు వీలుగా నెలకు రూ.30 నుంచి 40 వేలు చెల్లించి మరీ ఆడ, మగ మనుషులను నియమిస్తున్నారు. ఇలాంటివారు మంచం పట్టి లేవలేని వారికి సపర్యలు చేస్తూ 24 గంటలు వారితోనే ఉంటారు. అన్నీ ఉండి తమ బిడ్డలు దూరమై కేవలం మీలాంటి వారితో సేవ చేయించుకోవాల్సి వస్తుందంటూ మంచం పట్టినవారు కంట తడిపెడితే ఆ కన్నీటిని తుడిచే వ్యక్తులు ఈ అద్దె మనుషులే. చావొచ్చినా, పెళ్ళొచ్చినా కూడా ఇలాంటి వారే ఈనాటి సమాజంలో అందరికీ అవసరం అవుతున్నారు.

### పరాయివాళ్ళే దిక్కు : రామారావు



జీవితాంతం పిల్లల కోసం కష్టపడిన తల్లిదండ్రులు ముసలితనంలో బిడ్డలకు భారమవుతున్నాం. సంపాదించిన ఆస్తినంతా లాక్కుని కన్నవాళ్ళను గెంటేసేవారు కొందరైతే సాకలేమంటూ పీడ వదిలించుకోవాలని భావించేవారు ఇంకొందరు. తల్లిదండ్రులు కదలలేని స్థితిలో ఉన్నా వారిని ఇంటి నుంచి తరిమేసేందుకు వెనుకాడనివారు అనేకమంది. కలికాలంకదా. జరగరానివన్నీ ఇప్పుడే జరుగుతు న్నాయి. అయినవాళ్ళు ఎవరికీ పట్టడం లేదు. బిడ్డలకైనా, బంధువులకైనా, స్నేహితులకైనా ఎవరికైనా కష్టం వచ్చినా నష్టం వచ్చినా ఊరడించేవారు లేరు.

### ఇదివరకటి పరిస్థితేది : వెంకటలక్ష్మమ్మ



ఇప్పుడు ఆప్యాయత, ప్రేమ, అనురాగం లాంటి వాటికి అర్థం లేకుండా పోయింది. పక్కింట్లో ఏమైనా ఆపద సంభవిస్తే మాట వరుసకైనా పలకరింపులే తప్ప సహాయ సహకారం లేనేలేదు. ఇది కాలానుగుణంగా వస్తున్న మార్పు. రానురాను కుటుంబ వ్యవస్థలో మార్పులు, చేర్పులు అనివార్యం. ఎవరికైనా ఏమైనా కావాల్సి వచ్చినా రోజుల తరబడి మంచం పట్టినా కనీసం వారిని ఆదుకునేందుకు సొంత మనుషులే కరువవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే అద్దె మనుషులు పుట్టుకొస్తున్నారు. చేతిలో డబ్బుంటే అంతా సవ్యంగానే జరుగుతుంది. మరి లేకుంటే..?


## రంగులు మారే మందారం



ఉదయం పాలరంగులో.. మధ్యాహ్నం లేత గులాబీ, సాయంత్రం గులాబీ రంగులో మందారం

విరివిగా పూసే పూల మొక్కలలో ప్రత్తి మందారం ఒకటి. సెప్టెంబరు, అక్టోబరులో పూలు పూసే ఈ మొక్కలకు ఒక ప్రత్యేకత ఉన్నది. దీని పూలు రంగులు మారుతుంటుంది.. తెల్లవారుజామున తెల్లటి పాల రంగులో, మధ్యాహ్నం లేత గులాబీ రంగులో, సాయంత్రం 4 గంటలకు ఆపై ఆరు గంటలకు ముదురు గులాబీ రంగులోకి మారుతూ ఉంటుంది. తెలుపు, లేత గులాబీ, ముదురు రంగుల్లోకి మారుతూ ఈ మందారం కనువిందు చేస్తుంది. భీమడోలులోని సాయి సిద్ధార్థ, మోహనరుద్ర ఇంట్లో గతేడాది కడియం నర్సరీ నుంచి తెచ్చిన ఈ మొక్క రంగులు మారుస్తూ చూపరులను ఆకట్టుకుంటున్నది. **- భీమడోలు**

### కోతి స్వైరవిహారం



మొగల్తూరు,నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు కోట, గోడావారిపేట గోడావారిపేట, కోట, పెద్ద గొల్లగూడెం ప్రాంతాల్లో కొండముచ్చు స్వైరవిహారం చేస్తూ మేకలను చంపేస్తోంది. శుక్రవారం రాత్రి మేకలు, గొర్రెలు, కోళ్ళను చంపిందని మేకల పెంపకం దారులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే శనివారం నాగదేవత ఆలయం వద్ద పండుకోతి రోడ్డుపై కనబడిన కుక్కపిల్లను ఎత్తుకు వెళ్లింది. పిల్లిపిల్లలు, కుక్కపిల్లలను ఎత్తుకెళుతోందని స్థానికులు చెబుతున్నారు.

### షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు

అత్తిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : షష్ఠి ఉత్సవాలకు అత్తిలి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు చేపట్టారు. ఈనెల 6వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయి. ఆలయ ప్రాంగణంలో భారీ చలువ పందిళ్ళను నిర్మించారు. ఆలయ ముఖద్వారం నుంచి ఆలయం వరకు గల ప్రధాన మార్గాలలో విద్యుత్ దీపాలతో దేవతామూర్తుల సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. 6వ తేదీ రాత్రి 8.28 గంట లకు కూనపరెడ్డి తేజ, విజయలక్ష్మి దంప తులచే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తారు. 7న షష్ఠి తీర్థ మహోత్సవం, అన్న సమారాధన, రాత్రి స్వామివారి ఊరేగింపు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

## పౌరాణిక నాటకానికి చక్రవర్తి

### నేడు షణ్ముఖి ఆంజనేయరాజు జయంతి

తెలుగు నాటక రంగానికి 150 సంవత్సరాల ఘనమైన చరిత్ర ఉంది. 1880లో ప్రదర్శించబడిన వ్యవహారిక ధర్మబోదిని నుంచి నేటి వరకు కొన్నివేల తెలుగు నాటకాలు వెలుగు చూశాయి. వేలాది మంది నటీనటులు ఎన్నో పాత్రలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. వారందరూ మహనీయులు. తెలుగు నాటకాన్ని ప్రభావితం చేసిన కొద్దిమంది పేర్లు చెప్పాల్సి వస్తే తొలివరుసలో నిలిచే పేరు షణ్ముఖి ఆంజనేయ రాజు. శ్రీకృష్ణుడిగా ఆంజనేయరాజు ప్రేక్షకులకు చిరస్మరణీయులు. పాండవోద్యోగ విజయాలు నాటకంలోని రాయబార పద్యాలు వింటే ఆయన నోటే వినాలి.డిసెంబరు 1వ తేదీ పౌరాణిక నాటకానికి పండుగరోజు లాంటిది. పౌరాణిక పాత్రలకు ప్రాణప్రతిష్ట చేసి ఎన్నో సంగీత రాగాలను పౌరాణిక నాటకానికి పరిచయం చేసిన గాన గంధర్వ షణ్ముఖి ఆంజనేయరాజు జయంతి నేడు.. వారి కుమారుడు జయవిజయ కుమార్ రాజు షణ్ముఖి 96వ జయంతిని తణుకు సురాజ్య భవనం నందు 1వ తేదీ ఆదివారం సాయంత్రం ప్రముఖ కవి రసరాజు అధ్యక్షతన నిర్వహించనున్నారు. అదేరోజు షణ్ముఖి పురస్కార ప్రదానం చేయనున్నారు.

#### కృష్ణుడు, శ్రీరాముని పాత్రల్లో ..

1928 డిసెంబరు 1న అనపర్తి గ్రామంలో ఆంజనేయరాజు జన్మించారు. వారి తండ్రి రంగరాజు తల్లి లక్ష్మీనారాయణమ్మ రంగరాజు అందమైన వాడు. మంచి కంఠం..ఆ రోజుల్లో రాజమండ్రిలోని నాటక సమాజంతో వారికి పరిచయాలు ఉండేవి. స్త్రీ పాత్ర పోషణలో ప్రసిద్ధి చెందిన ముప్పిడి జగ్గరాజు ప్రోత్సాహంతో రంగరాజు బొబ్బిలి యుద్ధం నాటకంలో విజయ రామరాజుగా నటించారట. లక్ష్మీ నారాయణమ్మది తెనాలి దగ్గరున్న మోదుకూరు గ్రామం. కాలక్రమంలో వారి కుటుంబం మోదుకూరు మకాం మార్చారు. అక్కడ ఆంజనేయరాజు సంగీతం నేర్చుకున్నారు. మోదుకూరులో వేమన జయంతి ఉత్సవం జరిగింది. ఆ ఉత్సవంలో శ్రీకృష్ణ రాయబారం నాటకం ప్రదర్శించారు. అందులో సహోదరుడి వేషంలో తొలిసారిగా ఆయన రంగస్థల ప్రవేశం జరిగింది. అయితే అంతకుముందే ఆయన బాల నటులతో కలిసి లోహితునిగా, రఘురాముడిగా నటించారు. తర్వాత ఎందరో గురువులు షణ్ముఖిని తీర్చిదిద్దారు. తెనాలిలో వారికి మంచి గుర్తింపు లభించింది. హరిశ్చంద్ర నాటకంలో నక్షత్ర పాత్రలో ఎంతో పేరుప్రతిష్టలు లభించాయి. ఒకసారి రంగస్థలంపై నటిస్తుండగా ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం చూశారు.ఆయన గాత్రం, రూపం నచ్చి వెంటనే రాజును పిలిపించి మహాత్మగాంధీ జీవితాన్ని బుర్రకథగా చెప్పమని అడిగారు. సంతోషంగా అంగీకరించిన ఆంజనేయరాజు గాంధీజీ జీవితాన్ని ఆదర్శాలను బుర్రకథగా చెబుతూ ఎన్నో గ్రామాలలో ప్రదర్శనలు చేశారు. కాలక్రమంలో షణ్ముఖి ప్రయాణం తణుకు వైపు సాగింది. తణుకు దగ్గర ఉన్న వరిఘేడులో ఉంటూ నాటక ప్రదర్శనలు చేసేవారు. శ్రీకృష్ణుడు, శ్రీరాముని పాత్రల్లో ఆయనకు మంచి గుర్తింపు లభించింది. ఎన్నోయేళ్ళుగా ఇతర సమాజాలతో కలసి నటిస్తూ వచ్చిన ఆయన 1948లో శ్రీబాల త్రిపుర సుందరీ నాట్యమండలిని స్థాపించారు. నాట్య మండలి ప్రదర్శించిన నాటకాలలో కురుక్షేత్రం, గయోపాఖ్యానం, శ్రీరామాంజేయ యుద్ధం, శ్రీకృష్ణ తులాభారం నాటకాలు ప్రసిద్ధి చెందాయి. ఎందరో నటీనటీల్ని ఆయన తీర్చిదిద్దారు.

#### ఆయన రాగాలకు ఎందరో అభిమానులు

కురుక్షేత్రంలో కృష్ణుడిగా గయోపాఖ్యానంలో కృష్ణుడిగా, శ్రీరామాంజనేయ యుద్ధంలో శ్రీరాముడిగా, శ్రీకృష్ణతులాభారంలో నారదుడిగా, చింతామణి నాటకంలో బిల్వమంగళుడిగా, సత్యహరిశ్చంద్ర నాటకంలో నక్షత్రుకుడిగా వేలాది ప్రదర్శనలు చేసిన ఘనత ఆయన సొంతం. ముఖ్యంగా శ్రీకృష్ణ పాత్ర ఆయనకెంతో గుర్తింపునిచ్చింది. ముందుకాలంలో వారి అనంతర కాలంలో ఎందరో శ్రీకృష్ణ పాత్రని ఎంతో గొప్పగా పోషించినా షణ్ముఖి స్థానం మాత్రం అనితర సాధ్యం. ఒకేరోజు మూడు గ్రామాలలో మూడు వేదికలపైన శ్రీకృష్ణుడిగా నటించి, ప్రేక్షకులను మెప్పించిన గొప్ప నటుడాయన. సంగీతం ఆయనకు జన్మతః లభించిన వరం. ఒక్కో పద్యంలో ఒక్కో పాదాన్ని ఒక్కో రాగంలో పాడి క్షణంలో మరో రాగానికి మారిపోయేవారు. ఆయనకున్న సంగీత విద్వత్తు వల్ల రాగ సమ్మేళన ప్రతిభ వల్ల ఈ ప్రయోగాన్ని ఎంతో విజయవంతం చేసేవారు. గ్రామఫోను రికార్డింగ్ కంపెనీ ఆయన పద్యాలను రికార్డు చేసి విడుదల చేసింది. అవి బహుళ ప్రజాదరణ పొందాయి. ఆంజనేయరాజు నటనా ప్రతిభను ఎందరో అనేక విధాలుగా గౌరవించారు. గాన గంధర్వుడని, పౌరాణిక నాటక చక్రవర్తి అనీ, కలియుగ కృష్ణుడనీ కీర్తించారు. 1990లో మద్రాసు తెలుగు అకాడమీ బళ్ళారి రాఘవ అవార్డు ఇచ్చి సత్కరించింది. జీవితమంతా కళారంగంలోనే గడిపిన షణ్ముఖి ఆంజనేయరాజు చివరి నాటకం భీమవరం మావుళ్ళమ్మ ఉత్సవాల్లో ప్రదర్శించిన కురుక్షేత్రం. అప్పటికే ఆయన ఆరోగ్యం క్షీణించింది. అయితే తన కోసం ఎదరు చూసే ప్రేక్షకులను నిరుత్సాహ పర్చలేక శ్రీకృష్ణుడిగా నటించారు. 1997 ఫిబ్రవరి 18న భీష్మ ఏకాదశి రోజున దివంగతులయ్యారు. ఆయన భౌతికంగా జీవించి ఉండకపోయినా ఆయన పద్యం, నటన చిరకాలం నిలిచే ఉంటాయి.

-తణుకు (ఆంధ్రజ్యోతి)

నివాళి





ఏలూరు ప్రభుత్వాసుపత్రి

అంతా అధ్వానం, అపరిశుభ్రత దానికి తోడు వైద్యుల కొరత సమస్యలు వెంటాడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇచ్చే 2023-24 అవార్డులకు ప్రధాన ఆసుపత్రులు దూరమయ్యాయి. ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని ఏలూరు నగరంలో ప్రధాన ఆసుపత్రి, భీమవరం పట్టణంలోని ప్రాంతీయ ఏరియా ఆసుపత్రి, తణుకు, పాలకొల్లు, నరసాపురం, ఆకివీడులోని ఆసుపత్రులు కాయకల్ప అవార్డులకు వెనుకంజలో ఉన్నాయి. నూజివీడు ఏరియా ఆసుపత్రి, తాడేపల్లి గూడెంలోని ఆసుపత్రి అవార్డులకు ఎంపికయ్యాయి.


భీమవరం ఆసుపత్రిలో మూలకు చేరిన విరిగిన మంచాలు

# సమస్యల తిష్ఠ

**అవార్డులకు ఎంపిక కాని ప్రధాన ఆసుపత్రులు**

## ఏలూరు ఆస్పత్రిలో వైద్యుల కొరత

ఏలూరు క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వా సుపత్రిలో యంత్రవైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయి కానీ వైద్యులు కొరత వెంటాడుతోంది. అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో ఉన్న ఎంఆర్‌ఐ స్కాన్, సిటి స్కాన్ కూడా ఉంది. జిల్లా కేంద్ర ఆసుపత్రిగా ఉన్నప్పుడు వైద్య విధానపరిషత్ ఆధీనంలో ఉండేది. అప్పట్లో రాష్ట్రస్థాయిలోనే రెండు పర్యాయాలు అవార్డులు సాధించగా జాతీయ స్థాయిలో రెండుసార్లు ప్రథమస్థానంలో అవార్డులను సాధించాయి. సీఎం చంద్రబాబునాయుడు కేంద్రమంత్రుల నుంచి అప్పటి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీఆర్ మోహన్ అవార్డులను అందుకున్నారు. అంతకీర్తి గడించిన ఆసుపత్రిని టీచింగ్ ఆసుపత్రిగా మార్చడంతో డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోకి వెళ్ళిపోయింది. ప్రభుత్వం వైద్య పోస్టులు మంజూరు చేసినా ఆ పోస్టులు భర్తీ కాకపోవడంతో ఇక్కడ వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రజల్లో ఆసుపత్రిపై వ్యతిరేకత మొదలైంది.

**పోస్టులు ఉన్నా ఖాళీగానే..**

ఆసుపత్రిలో ఒక మెడికల్ సూపరింటెండెంట్, ఆరుగురు అత్యవసర విభాగపు వైద్యుల పోస్టులు మంజూరు అయ్యాయి. అత్యవసర విభాగానికి ఆరు మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఉండగా, రెండు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఉన్న నలుగురిలో ఇద్దరు మహిళా వైద్యులు మెటర్నిటీ లీవులో ఇటీవల వెళ్ళిపోవడంతో అత్యవసర విభాగంలో ఇద్దరు వైద్యులు ఉన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి 18 ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కాగా తొమ్మిది మంది విధుల్లో చేరారు. అసోసియేట్ ప్రొఫెసర్స్ 37కు 27 మంది చేరారు. అసిస్టెంట్ ప్రొఫెసర్స్ 51కి 36 మంది చేరారు.

**వైద్యుల కొరత ఉంది**



వైద్యసిబ్బంది కొరత సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళాం. వారి ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో పరిధిలోని వైద్యులు వచ్చారు. ప్రస్తుతం క్యాజువ్యాల్టీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ ఎంఎస్ రాజు, మెడికల్ సూపరింటెండెంట్

## తణుకులో పారిశుధ్యం వీక్..


తణుకు ప్రభుత్వాసుపత్రి

తణుకు : తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో అందించే వైద్య సేవలు భేషుగ్గా ఉంటాయనేది అందరి నోటా వినే మాట. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అనేక ప్రాంతాల్లోని రోగులు ఇక్కడకు వచ్చి వైద్యం పొందుతారు. అవార్డు ప్రామాణికంగా ఆసుపత్రిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రధాన లక్ష్యం. ఇక్కడ పారిశుధ్యం, పరిసరాల శుభ్రత లోపాలు ఎక్కువగా ఉండడంతో ఈసారి అవార్డుకు దూరమమైంది. ఈ ఆసుపత్రిలో కనీసం 32 మంది పారిశుధ్య కార్మికులు ఉండాలి.. ప్రస్తుతం 21 మంది ఉన్నారు. వీటితో పాటు సేవల పరంగా ట్రామా కేర్, ఐసీయూ, సిటి స్కాన్, ఎంఆర్‌ఐ, పార్కింగ్ (గ్రీన్ జోన్)వంటివి లేకపోవడం కారణంగా చెబుతున్నారు. ఆసుపత్రిలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవస్తంగా ఉంది. వార్డుల్లో వినియోగించే వ్యర్థ నీరు డ్రెయినేజీల ద్వారా బయటకు వెళ్లే పరిస్థితి లేదు. ఆసుపత్రిలో స్కానింగ్ మిషన్ ఉంది. దానిని ఉపయోగించే రేడియాలజిస్టు లేరు. దీంతో గత నాలుగేళ్ల నుంచి మూలపడి ఉంది.

**పారిశుధ్యం మెరుగుపర్చాలి**



ఆసుపత్రిలో పారిశుధ్యం మెరుగుపర్చాలి.. సిబ్బంది తగినంత లేకపోవడం వల్ల వాళ్ళ పరిధికి మించి పనిచేస్తున్నారు. వంద పడకల ఆసుపత్రి సిబ్బంది 150 పడకల ఆసుపత్రికి పని చేస్తున్నారు. రానున్న రోజుల్లో మెరుగైన ఫలితాలు సాధనకు కృషి చేస్తాం.

– డాక్టర్ వెలగల అరుణ, సూపరింటెండెంట్

## 2022-23 అవార్డు ప్రోత్సాహ నగదు అందలేదు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో 2022-23 ఏడాదికిగాను పరిశుభ్రతపై జాతీయస్థాయిలో నిర్వహించిన కాయకల్ప ప్రోగ్రాంలో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి మొదటి స్థానం పొంది అవార్డు అందుకున్నాం. ఈ అవార్డుతో పాటు రూ.20 లక్షల నగదు ప్రోత్సాహకం అందించాల్సి ఉండగా ఇప్పటివరకు అందజేయలేదు. ఈ ఏడాది కాయకల్ప బృందం తనిఖీలు చేయడంతో 97 శాతం మార్కులు పొందాం. 2022లో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్సు (ఎన్‌క్వాస్) బృందం వారు అవార్డు అందించారని, దీనిలో భాగంగా ఏడాదికి రూ.పది లక్షల చొప్పున మూడేళ్లపాటు రూ.ముప్పై లక్షలు అందించాల్సి ఉండగా ఇప్పటికి ఒక్కసారి రూ.పది లక్షలు అందించారు.



– డాక్టర్ సీహెచ్.బేబీ కమల, సూపరిండెంటెంట్

## భీమవరం ఆసుపత్రిలో అపరిశుభ్రతే సమస్య

భీమవరం క్రైం : భీమవరం పట్టణంలోని ప్రాంతీయ ఏరియా ఆసుపత్రి ఎంతో పేరుగాంచింది. కొన్ని అనివార్య కారణాల వల్ల వంద పడకల ఆసుపత్రికి నోచుకోలేదు. 2015లో అప్పటి ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న కామినేని శ్రీనివాస్ ఆసుపత్రి నూతన భవనానికి రూ.తొమ్మిది కోట్లు కేటాయించడంతో చాలా వరకు వసతులు సమకూరాయి. గత ప్రభుత్వ హయాంలో కొన్ని తప్పిదాల వల్ల ఆసుపత్రి పారిశుధ్యం విషయంలో చాలా ఇబ్బందులు తలెత్తాయి. ఆసుపత్రి మరుగుదొడ్డి, రోగులకు ఇచ్చే రూములు, మంచాలు, మార్చురీ రూము ఇలా అన్నీ అభివృద్ధికి నోచుకోలేదు. కొత్తగా వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వంలో కూడా ఎటువంటి మార్పులు లేవు. ఆసుపత్రి పెద్దది కావడం వల్ల పారిశుధ్యం విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి జీతాలు కూడా సరిగా ఇచ్చే పరిస్థితిలో లేరని చెబుతున్నారు. కొందరు స్పెషలిస్టు వైద్యులు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కనిపించక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్యులు అన్నివేళల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించినప్పటికీ వైద్యుల్లో ఎటువంటి మార్పు లేదు. కొన్ని రకాల మందులతో పాటు, రక్త పరీక్షలకు బయటకు పంపడం తదితర కారణాలతో ఆసుపత్రి అవార్డుకు నోచుకోలేదని ప్రచారం

**89 శాతం స్కోర్ ఉన్నా ఎంపిక కాలేదు**



భీమవరం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి కాయకల్పలో 89శాతం స్కోర్ ఉంది. కానీ ప్రభుత్వం అవార్డు ఎంపిక చేయకపోవడం ఏమిటో అర్థం కావడం లేదు. కొన్ని ఆసుపత్రులకు మాత్రమే అవార్డులు ఇచ్చారు. ఈ ఆసుపత్రి అన్ని విధాలుగా బాగానే ఉంది. భీమవరం ఆసుపత్రికి ముస్కాన్, ఇన్‌క్యూస్, లక్ష్య సర్టిఫికెట్లు కూడా దక్కాయి.

– డాక్టర్ మాధవి కళ్యాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్

## కాయకల్ప అవార్డులకు నూజివీడు, తాడేపల్లిగూడెం ఆసుపత్రులు


నూజివీడు ఏరియా ఆసుపత్రి


2019లో సీఎం చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న సూపరింటెండెంట్ నరేంద్రసింగ్

## నూజివీడు ఆసుపత్రికి ఐదోసారి అవార్డు

నూజివీడు టౌన్ : జాతీయస్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించిన ఆసుపత్రులకు ప్రదానం చేసే కాయకల్ప అవార్డుల్లో ఏలూరు జిల్లా నూజివీడు ఏరియా ఆసుపత్రి చోటుదక్కించుకుంది. దేశంలోని పలు ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలతో పోటీపడి రాష్ట్రస్థాయిలో రెండోస్థానంలో నిలిచి అవార్డును అందుకుంది. ఆసుపత్రుల్లో పారిశుధ్య నిర్వహణ, అందిస్తున్న సేవలకు ఈ అరుదైన గౌరవం ఏరియా ఆసుపత్రికి మరోసారి దక్కింది. రాష్ట్రంలోని ఏరియా ఆసుపత్రుల్లో నూజివీడు ఆసుపత్రి 2015 నుంచి ఇప్పటి వరకు వరుసగా నాలుగుసార్లు కాయకల్ప అవార్డును అందుకోగా, ప్రస్తుత ఏడాది మరోసారి ఎంపికైంది. 2019లో ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్‌ను పొందింది. ఇదేకాక 2019లో అప్పటి, ఇప్పటి సీఎం నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఉత్తమ ఏరియా ఆసుపత్రిగా అవార్డును అందుకుంది. వీటితో పాటు 2011 నుంచి ప్రపంచ ఆరోగ్యదినోత్సవాన్ని పురస్కరించుకుని అందుకునే అవార్డులను నూజివీడు ఏరియాఆసుపత్రి వరుసగా అందుకోవడం విశేషం.

**అవార్డు రావడం ఆనందాన్నిచ్చింది..**



నూజివీడు ఏరియా ఆసుపత్రికి కాయకల్ప అవార్డు రావడం ఆనందంగా ఉంది. దీనికి సంబంధించిన అధికారిక సమాచారం అధికారుల నుంచి ఇంకా రావాల్సి ఉంది. ఇప్పటికి నాలుగుసార్లు కాయకల్ప అవార్డు అందుకోగా మరోసారి అవార్డుకు ఎంపిక కావడం విశేషం.

– నరేంద్రసింగ్, సూపరింటెండెంట్, నూజివీడు ఏరియా ఆసుపత్రి


తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి

## తాడేపల్లిగూడెం ఆసుపత్రికి ఇదే ఫస్ట్

తాడేపల్లిగూడెం రూరల్ : రాష్ట్రంలోనే అత్యున్నత సేవలందించే ఆసుపత్రుల్లో ఒకటిగా తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి అవార్డు సొంతం చేసుకుంది. ఈ ఆసుపత్రి పరిశుభ్రతతో పాటు వైద్యసేవలు అంశాలపై సర్వే ఆధారంగా అందించే ఈ అవార్డు తాడేపల్లిగూడెంకు దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉంచడంతో పాటు రోగులకు సేవలందించే విధానం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ అవార్డు అందుకోవడం ఇదే ప్రథమం. ఈ అవార్డుతోపాటు ప్రభుత్వం రూ.10లక్షలు నగదు ప్రభుత్వం అందిస్తుంది.

**మెరుగైన సేవలకు కృషి చేస్తాం**



రూ. పది లక్షల నగదును ఎమ్మెల్యే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తాం. ట్రామా సెంటర్ అవసరం ఆ సెంటర్ ఏర్పాటుకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచనల మేరకు పనిచేస్తాం. అత్యవసర సేవలు అందించేందుకు ఈ సెంటర్ ఏర్పాటుతో సుగమం అవుతుంది.

– ఏవీఆర్ఎస్ తాతారావు, ఏరియా ఆసుపత్రి సూపరింటింటెండెంట్

## ఆకివీడు ఆసుపత్రి సమస్యలమయం




ఆకివీడు : ఆకివీడు సామాజికి ఆరోగ్య కేంద్రాన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. 2001లో పీహెచ్‌సీగా ఏర్పడింది. 2011లో 30 పడకలతో సీహెచ్‌సీ ఏర్పాటు చేశారు .కొల్లేరు తీర ప్రాంతాలైన సుమారు 60 గ్రామాల ప్రజలు ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతుంటారు. నేటికి ఈ ఆసుపత్రిలో పిల్లలు, మత్తుకు సంబంధించి వైద్యులు లేరు. ఫిజియో థెరపీకి టెక్నీషియన్ ఉన్నా పరికరాలు లేవు. ఎక్సరే, ఆర్థోపెడిక్, పోస్టుమార్టం తదితర సేవలు లేక పోవడంతో వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటికి తోడు డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో శానిటేషన్ క్షీణించడం, సమీపంలోనే అనధికార డంపింగ్‌యార్డు ఉండడంతో ఆసుపత్రిలోకి ఈగలు, దోమలతో వ్యాధిగ్రస్తులు మరికొన్ని రోగాలు బారినపడుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**



ఆసుపత్రి సమస్యలు ఉన్నతాధికారులు, పాలకులు దృష్టికి తీసుకెళ్ళాం. సమీపంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన ఆసుపత్రిని ప్రారంభిస్తే మరింత అభివృద్ధి చెందుతుంది. డ్రెయినేజీ, అనధికార డంపింగ్‌తో వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– అచ్యుత్ గణేశ్వరరావు, సూపరింటెండెంట్, ఆకివీడు

## స్థాయి పెరిగినా.. సమస్యలెన్నో..


నరసాపురం ఆసుపత్రి

నరసాపురం : తీరంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో 50 నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ అయినా.. దానికి తగ్గట్టుగా సౌకర్యాలు మెరుగుపడలేదు. వైద్యుల సంఖ్య పెరిగినా.. శానిటేషన్ సిబ్బంది కొరత మాత్రం తీరలేదు. 23 మంది వైద్యులకు గాను ప్రస్తుతం 19 మంది పని చేస్తున్నారు. రేడియాలజిస్టు లేకపోవడంతో స్కానింగ్ సెంటర్ అందుబాటులో లేదు. డిప్యూటీ సర్జన్, ఇంకా ఇద్దరు జనరల్ మెడిసన్ వైద్యుల్ని భర్తీ చేయాల్సి ఉంది. నెలవారీగా డెలివరీ కేసులు 60 నుంచి 80కి పెరిగాయి. ఇక ఇద్దరు సర్జన్లు ఉండడంతో అపరేషన్ల సంఖ్య 60 దాటింది. ఈ ఆస్పత్రికి 2016, 2021లో రెండుసార్లు అవార్డులు దక్కాయి. ఈసారి కేంద్రం ఇచ్చే అవార్డుకు నాలుగు పాయింట్లు దూరంగా నిలిచింది.

**వచ్చే ఏడాది సాధిస్తాం..**



కమిటీ ఆస్పత్రిని సందర్శించే సమయంలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు, కొత్త ఆస్పత్రి ప్రారంభమైన కొన్ని పనులు పెండింగ్ ఉండడం వల్ల పాత భవనంలోనే కొన్ని విభాగాలు నిర్వహిస్తూ వచ్చాం. వచ్చే ఏడాదినాటికి పెండింగ్‌వన్ని పూర్తి చేసుకుని అవార్డు దక్కించుకుంటాం.

డాక్టర్ సుప్రియ, అస్పత్రి సూపరింటెండెంట్


తండ్రి మృతదేహానికి తలకొరివి పెట్టడానికి వెళుతున్న పెద్ద కుమార్తె రితిక

## తండ్రి మృతదేహానికి కుమార్తె అంత్యక్రియలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు పట్టణంలో హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన లారీ డ్రైవర్ పోతంశెట్టి సూర్య నారాయణ(45) గుండెపోటుతో శనివారం ఉదయం మరణించాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో ఇంటర్ చదువుతున్న పెద్ద కుమార్తె రితిక తండ్రి మృతదేహం వెంట వెళ్లి అంత్యక్రియల్లో భాగంగా మృత దేహానికి దహన సంస్కారాలు చేసింది. ఈ ఘటన స్థానికులను కలచి వేసింది.

## దంపతులకు గాయాలు

పోలవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కన్నాపురం అడ్డరోడ్డు జంక్షన్‌లో శనివారం జరిగిన బైకు ప్రమాదంలో మత్స్యకార కుటుంబానికి చెందిన దంపతులు గాయాలపాలయ్యారు. దొండపూడికి చేపల అమ్మకానికి వెళ్ళి తిరిగి వస్తూ జంక్షన్ వద్ద పట్టిసీమ వైపు మలుపు తిరిగే క్రమంలో రోడ్డు మార్జిన్ సరిగా లేకపోవడంతో బైకు కిందకు పడి గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు వారికి ప్రథమ చికిత్స అందించారు.




## క్రైమ్ కార్నర్


అగ్నిప్రమాదంలో దగ్గమవుతున్న ఇల్లు

## షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

లింగపాలెం, నవంబరు30, (ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన లింగపాలెం మండలం యడవల్లిలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన గజ్జల దుర్గారావుకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు, ఫైర్‌సిబ్బందికి సమాచారమందించారు. ఫైర్ సిబ్బంది స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేశారు. సైకిల్ మెకానిక్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తూ, పొలంలో వరికోత వద్దకు వెళ్లి వచ్చేసరికి ఈ ఘటన జరిగిందన్నారు. తన భార్య దివ్యాంగుల పింఛన్ సొమ్ములు రూ.6 వేలతో పాటు ఇంట్లో వున్న రూ.4 వేల నగదు, బంగారం, సామగ్రి దగ్ధమయ్యాయని కట్టుబట్టలతో మిగిలా మని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ప్రమాదంలో రూ. 2 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు ఫైర్ ఆఫీసర్ తోట కోటేశ్వరరావు తెలిపారు. ఫైర్‌సిబ్బంది పి.రామకృష్ణ, శివకృష్ణ, రవికుమార్ మంటలను అదుపుచేశారు.

## కువైట్ నుంచి దేవ గ్రామానికి మృతదేహం రాక


చినబాబు (ఫైల్)

పెనుగొండ, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి నిమిత్తం కువైట్ దేశం వెళ్ళిన గూనపాటి చిన బాబు(40) కువైట్ దేశంలో నవంబరు 27వ తేదీన గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో చినబాబు మృతదేహం కువైట్ నుంచి శనివారం సాయంత్రానికి పెనుగొండ మండలం దేవ గ్రామానికి చేరుకుంది. అతడి మృతదేహాన్ని చూసి భార్య, ఇద్దరు కుమారులు, తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం క్రైస్తవ సంప్రదాయం ప్రకారం అతడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

## ఆగిన లారీని ఢీకొట్టిన బైక్.. ఒకరి మృతి


లారీ కిందకు దూసుకెళ్లిన బైక్.. (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన పైడిరాజు

కాళ్ళ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనదారుడైన యువకుడు ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం కాళ్ళ మండలం సీసలిలో చోటు చేసుకుంది. కాళ్ళ పోలీసులు తెలిపిన వివరాలివి.. జువ్వలపాలెం గ్రామానికి చెందిన ముంజేటి పైడిరాజు అలియాస్ (25), చోడవరపు మధుబాబు శనివారం ఉదయం మోటార్ సైకిల్‌పై ఎల్ఎన్‌పురం గ్రామానికి చేపల ప్యాకింగ్ పనినిమిత్తం వెళ్తున్నారు. సీసలి గ్రామానికి వచ్చేసరికి రైస్‌మిల్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న పైడిరాజు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక కూర్చున్న మధుబాబుకు గాయాలవ్వడంతో భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి అన్నయ్య నారాయణరావు ఫిర్యాదు మేరకు కాళ్ళ ఎస్ఐ ఎన్. శ్రీనివాసరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## బైక్ డిక్కీలో పెట్టిన రూ.2.5 లక్షలు కొట్టేశారు

» నిందితుడిని అరెస్ట్ చేసి సొమ్ము స్వాధీనం చేసుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్, తదితరులు

ఏలూరు క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులో నగదు డ్రా చేసుకుని ఆ సొమ్మును ద్విచక్ర వాహనంలో ఉంచి పనిచూసుకుని వచ్చేలోపల ఆ సొమ్మును అపహరించుకు పోయిన వ్యక్తిని భీమడోలు పోలీసులు అరెస్టు చేసి మొత్తం సొమ్మును స్వాధీనం చేశారని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. శనివారం రాత్రి ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. డీఎస్పీ తోపాటు భీమడోలు సీఐ యూజే విల్సన్, భీమడోలు ఎస్ఐ సుధాకర్, ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్ పాల్గొన్నారు. ద్వారకాతిరుమల మండలం ఎం. నాగులపల్లికి చెందిన నందమూరి సత్యానారాయణ వ్యవసాయం చేసి జీవిస్తున్నారు. ఆయన భీమడోలులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచినకు ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు వచ్చి బ్యాంకులోని సేవింగ్ ఖాతా నుంచి రెండున్నరలక్షల రూపాయలు విత్‌డ్రా చేసుకున్నారు. ఆ సొమ్మును స్కూటర్ డిక్కీలో పెట్టుకుని, దగ్గరలోని నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు షాపులోకి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి డిక్కీలో సొమ్ము అపహరణకు గురైంది. ఈ ఘటనపై వెంటనే భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. భీమడోలు సీఐ యూజే విల్సన్, భీమడోలు ఎస్ఐ సుధాకర్, ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్ వారి సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి గాలింపు చేపట్టారు. మొత్తం మీద ఈ నేరానికి పాల్పడిన భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన సప్పా రాముని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రెండున్నర లక్షల రూపాయల నగదును స్వాధీనం చేశారు. నిందితుడికి అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ, ఎస్ఐలను వారి సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## ఊరెళ్లి వచ్చేసరికి దోచేశారు

» నగదు, వెండి వస్తువుల చోరీ

ఉండి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో దొంగలు పడి రూ.13 వేలు నగదు.. పలు విలువైన వెండి వస్తువులు చోరీకి గురైనట్టు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఉండి పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారం గ్రామానికి చెందిన బీఎస్‌బీఆర్ సూర్యనారాయణ నెలరోజుల క్రితం ఇంటికి తాళం వేసి గ్రామ విడిచి మరో ఊరు వెళ్లారు. తిరిగి శనివారం ఊరు వచ్చేసరికి ఇంటితాళం పగులగొట్టి వుండడం, ఇంట్లోని వస్తువులు చెల్లాచెదరుగా ఉండడంతో పరిశీలించారు. బీరువాలోని రూ.13వేలు నగదు, విలువైన వెండి వస్తువులు చోరీకి గురైన్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ డీవీ శ్రీనివాస్ తెలిపారు.

## సెక్యూరిటీ గార్డుపై దాడి

భీమవరం క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఒక బ్యాంక్ వద్ద సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న తనపై నలుగురు యువకులు దాడి చేసి గాయపర్చారంటూ ఆదర్శనగర్‌కు చెందిన ఆకివీటి సుబ్రహ్మణ్యం శనివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుబ్రహ్మణ్యం మరో ఇద్దరు కలిసి ఈనెల 29వ తేదీన రాత్రి హౌసింగ్‌బోర్డు కాలనీలో ఒక బ్యాంక్ వద్ద సెక్యూరిటీ నిర్వహిస్తున్నారు. రెండు ద్విచక్ర వాహనాలపై తాడి లక్ష్మణ్‌కుమార్, ఇందుకూరి అజయ్‌వర్మ, పవన్ కళ్యాణ్, మల్లుల సుమంత్ అనేవారు వేగంగా వెళుతున్నారు. ఆ సమయంలో సుబ్రహ్మణ్యం అంతవేగం ఎందుకు అని తెలుపగా ఆ నలుగురు వచ్చి అతడిపై దాడి చేసి గాయపరిచి బూతులు తిటారు. గాయపడిన వ్యక్తిని తోటి సెక్యూరిటీ గార్డులు ఆసుపత్రిలో చేర్చారు. అతడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ తెలిపారు.

## ఒకరిపై పోక్సో కేసు

ఏలూరు క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భర్తతో విడాకులు పొందిన ఓ మహిళతో సహజీవ నం చేస్తున్న వ్యక్తి ఆ మహిళ కుమార్తె బాలికపై అసభ్యంగా ప్రవర్తించడంతో అతడిపై ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం పోక్సో కేసు నమోదైంది. వివరాలివి.. విశాఖపట్టణానికి చెందిన కాలి మహంతిరాజు ఓ ప్రైవేటు కంపెనీలో మార్కెటింగ్ చేస్తూ ఉంటాడు. అతడికి ఏలూరు బదిలీ అయింది. భర్తకు విడాకులు ఇచ్చిన ఓ మహిళతో అతడికి పరిచయం ఏర్పడి ఆమెతో పాటు ఏలూరు వచ్చి ఉంటున్నాడు. ఆమెకు అప్పటికే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమెతో సహజీవనం చేస్తూ ఆమె కుమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాలి మహంతిరాజుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల : కన్నాపురంలో పేకాటాడుతున్నట్టు సమాచారం రావడంతో శనివారం దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నామని ద్వారకాతిరుమల పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ. 3,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.


రాయలం అంగన్‌వాడీ కేంద్రానికి ఎస్‌బీఐ ఉపకరణాల పంపిణీ

## అంగన్‌వాడీ సెంటర్లకు ఉపకరణాలు

భీమవరం రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):స్టేట్ బ్యాంకు ఉపకరణాల పంపిణీలో భాగంగా భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఉన్న అంగన్‌వాడీ సెంటర్లకు ఉపకరణాలు పంపిణీ చేశారు. శనివారం రాయలం-5, యనమదుర్రు అంగన్‌వాడీ సెంటర్‌కు ఈ ఉపకరణాలను అమరావతి సర్కిల్ మిత్ర ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మీరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 60 అంగన్‌వాడీ సెంటర్లకు ఈ ఉపకరణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు ప్లే స్కూల్‌కు తీసిపోకుండా ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్లను నిర్వహిస్తుందన్నారు. పిల్లలకు అవసరమైన టీవీ, రైస్ కుక్కర్ వాటర్ ఫిల్టర్, స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, బ్యాగ్స్ బుక్స్, పెన్సిల్ బాక్స్‌లు, జారుడు బల్ల, వాటర్ బాటిల్స్, గుర్రంతో పాటు పలు రకాల ఆట వస్తువులు అందజేశారు. భీమవరం స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ హెచ్ ఆర్ మెహర్‌బాబా, ప్రాజెక్టు సీడీపీవో టి లక్ష్మీకాంతం, సూపర్‌వైజర్ అనిలా, టీచర్లు పాల్గొన్నారు.



## కేంద్ర మంత్రి వర్మకు ఎమ్మెల్యే ఆరిమిల్లి పరామర్శ

తణుకు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కృష్ణతులసితోపాటు కుటుంబ సభ్యులు శనివారం పరామర్శించారు. భీమవరంలోని ఆయన నివాసంలో సూర్యనారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తండ్రి సూర్యనారాయణరాజు ఆసుపత్రిలో ఉన్నప్పటికీ, మరోపక్క మంత్రి బాధ్యతలను నిర్వహించారన్నారు. కుటుంబీకుకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ఐకమత్యానికి వన సమారాధనలు దోహదం



ఆకివీడు రూరల్ నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఐకమత్యంగా జీవించడానికి వన సమారాధనలు దోహదపడతాయని తహసీల్దారు వెంకటేశ్వరరావు అన్నారు. దుంపగడపలోని కాటన్ పార్కులో ప్రభుత్వద్యోగులుతో కార్తీక వన సమారాధన నిర్వహించారు. నిత్యం విధులు బాధ్యతలతో ఉండే సిబ్బంది ఈ విధమైన కార్యక్రమంలో పాల్గొనడం వలన జోష్ వస్తుందన్నారు. ఈ సందర్బంగా గేయాలను ఆలపించి అందరిని ఆకట్టుకున్నారు. సిబ్బందికి ఆయనే స్వయంగా వడ్డించారు. మండలాధికారులు, సచివాలయ, నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




గుత్తులవారిపాలెంలో ధాన్యాన్ని బరకాలతో కప్పుకున్న రైతులు


ఉండిలో ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న మహిళా కూలీలు

# దేవుడా.. దేవుడా..

**తుఫాన్ ప్రభావంతో వర్షాలు**
**పలుచోట్ల నేలకొరిగిన వరిచేలు**
**ధాన్యం దక్కించుకునేందుకు అన్నదాత పాట్లు**

పాలకోడేరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో చేతికి వచ్చిన పంటను రైతులు రక్షించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. సార్వా సీజన్‌లో ఆటుపోట్లు ఎదుర్కొని పండించిన ధాన్యాన్ని గట్టెక్కించుకునే సమయంలో తుఫాన్ రూపంలో వర్షం రైతలను గజగజలాడిస్తోంది. ఇప్పటికే కొంతమంది రైతులు మాసూళ్ళు చేసుకోగా మరికొంత మంది మాసూళ్లు చేయాల్సి ఉంది. ఈలోగా తుఫాన్ రావడంతో రైతులు పరిస్థితి అయోమయంలో పడింది. అటుకూలీలు దొరక్క ఇటూ వరికోత మిషన్లు దొరక్క రైతులు పడిగాపులు కాస్తున్నారు. వర్షాలు కురవడంతో గట్లు పై ఆరబెట్టిన ధాన్యాన్ని బరకాలు కప్పుకుని రక్షించుకునే పనిలోపడ్డారు. ఇలాగే వర్షాలు రెండు మూడు రోజులు ఉంటే పంట దక్కదని రైతులు అంటున్నారు.

**ఆకివీడు:** తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం నిబంధనలు సడలించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాసరావు, ఏవో ప్రియాంకలు శనివారం ధాన్యం పట్టుబడిని పరిశీలించారు. మిల్లర్లు రైతులకు సహకరించాలన్నారు.

**గణపవరం:** తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులు, వర్షంతో వరిచేలు నేలకొరిగాయి. శనివారం ఉదయం నుంచి ఈదురుగాలులకు కోతకు వచ్చిన వరిచేలు పడిపోయాయి. ఇప్పటికే 60 శాతం మాసూళ్ళు పూర్తవగా ఇంకా 40 శాతం కోతకు సిద్ధంగా ఉన్నాయి. వాతావరణ మార్పులతో రైతులు పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కోసిన ధాన్యాన్ని బరకాలు కప్పుకుని కాపాడుకుంటున్నారు. వర్షం పెరగకుండా చూడాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నారు.

**ఉండి:** ఫెంగల్ తుఫాన్ రైతులను పరుగులెత్తిస్తోంది. సార్వా సీజన్ తొలి నుంచి భారీ వర్షాలు కురిసి మూడు దఫాలుగా నారుమడులను వేయాల్సి వచ్చింది. ఇప్పుడు పంట చేతికొచ్చే సమయానికి తుఫాన్ భయపెడుతోంది. మండలంలో యండగండి, ఉప్పులూరు, చిలుకూరు, ఉండి తదితర గ్రామాల్లో కురిసిన వర్షాలతో రైతులు బెంబేలెత్తుతున్నారు.


పదవీ విరమణ పొందిన వారితో జిల్లా ఎస్పీ అస్మి

## సేవలు ఆదర్శనీయం : ఎస్పీ

భీమవరం క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బంది సేవలు ఆదర్శనీయమని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ, పోలీస్ అధికారులు ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. పదవీ విరమణ పొందిన వారిలో భీమవరం సీసీఎస్ ఎస్ఐ లక్ష్మణ్‌కుమార్, భీమవరం డీసీఆర్‌బీ ఎస్ఐ వి.వరప్రసాద్, పెనుగొండ హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు ఉన్నారు. జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) వి.భీమారావు, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వరరావు, జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సిహెచ్ మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పస్ ఫండ్ అందజేత

సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన అత్తిలి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ డి.పీటర్ కుమారుడు డి.విద్యాసాగర్‌కి కార్పస్ ఫండ్ నుంచి మంజూరైన లక్ష రూపాయిల చెక్కును జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఏఎస్పీ(అడ్మిన్) వి భీమారావు, జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సిహెచ్ మోజేష్ పాల్గొన్నారు.

## ఆస్పత్రులు పరిశీలించిన ప్రత్యేకాధికారులు

ఉండి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):ప్రత్యేక అధికారులుగా నియమితులైన తహసీల్దారు నాగార్జున, ఎంపీడీవో రవీంద్రలు ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. శనివారం యండగండి పీహెచ్‌సీని ప్రత్యేక అధికారి నాగార్జున సందర్శించారు. రోగులను ఎటువంటి వైద్య సేవలందుతున్నాయంటూ ఆరా తీశారు. డా.శామ్యూల్ బెన్నిట్ కేంద్రం పనితీరును ఆయనకు వివరించారు. ఉండి పీహెచ్‌సీని ప్రత్యేక అధికారి రవీంద్ర పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. డా.సాయిచంద్ర కేంద్రం పనితీరును ఆయనకు వివరించారు.

## బొండాడలో వనసమారాధన

కాళ్ళ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):బొండాడలో భోగేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయాల ప్రాంగణంలో శనివారం వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మన్నే నాగరాజు, మాజీ ఎంపీపీ కందుల మల్లికార్జునరావు, మన్నే శ్రీనివాసరావు, కందుల హనుమ, పెన్మెత్స రంగరాజు, మన్నే సోమేశ్వరరావు, కందుల ప్రభాకరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.


న్యాయవాదులతో మాట్లాడుతున్న సోమశేఖర్

## 14న జాతీయ లోక్ అదాలత్

భీమవరం క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):డిసెంబర్ 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌పై చర్చించేందుకు న్యాయవాదులతో శనివారం భీమవరం 3వ అదనపు జిల్లా న్యాయాధికారి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఎంఎ సోమశేఖర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం 3వ అదనపు జిల్లా కోర్టుకు మోటార్ యాక్సిడెంట్ కేసులు 194 వరకు పెండింగ్‌లో ఉన్నాయని, ఇన్సూరెన్స్ కంపెనీలతో, కేసుల్లో ఫిర్యాదిదారులతో చర్చలు జరిపి ఇరు పార్టీలు అంగీకారంతో లోక్ అదాలత్‌లో ఎక్కువ మోటార్ యాక్సిడెంట్ కేసులు రాజీకి కృషి చేయాలన్నారు. న్యాయవాదులు నిమ్మల సత్యనారాయణ, బార్ అసోసియేషన్ కార్యదర్శి అడపాల ప్రసన్నకుమార్, పాకా రమేష్‌బాబు, నిమ్మల నవీన్, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పెదఅమిరంలోని మనోవికాస కేంద్రంలో చిన్నారులతో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

## మానసిక వికాసానికి క్రీడలు దోహదం

కాళ్ళ నవంబరు 30(ఆంధ్రజ్యోతి):మానసిక వికాసానికి క్రీడలు ఎంతో సహకరిస్తాయని ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం జగపతి రాజు అన్నారు. పెదఅమిరంలో శ్రీవిజ్ఞాన వేదిక, అరుణోదయ మనోవికాస కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటల పోటీలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగపతిరాజు మాట్లాడుతూ మనోవికాస కేంద్రంలో మానసిక వికలాంగులను చైతన్యవంతులుగా చేస్తూ క్రీడలు ఆడించడం, వారి జీవితాలకు వెలుగునివ్వడం గొప్ప విశేషమని, ఈ సంస్థకు తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. కేంద్రం డైరెక్టర్ చింతలపాటి అరుణాదేవి మాట్లాడుతూ 29 ఏళ్ళుగా కేంద్రం నిర్వహిస్తున్నామని, ఈ బాలల్లో ఎంతో చైతన్యం వచ్చిందన్నారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, నందమూరి రాజేష్, కారుమూరి చినబాబు, యర్రా సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## ప్లాస్టిక్ నిషేధంలో ప్రజలంతా మమేకం కావాలి

భీమవరం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):ప్లాస్టిక్ రహిత సమాజం చూడాలంటే ప్రజలంతా మమేకం కావాలని భీమవరం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, పురపాలక సంఘ సంయుక్త ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై మెంటేవారి తోటలోని వండర్ కిడ్స్ స్కూల్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ ను నిషేధించి గుడ్డ సంచులనే వాడాల న్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు ప్లాస్టిక్ నిషేధంపై పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. పాఠశాల డైరెక్టర్ అల్లు రామకృష్ణ, అల్లు వనజాక్షి ప్రిన్సిపాల్ వాణి, ఎండి వంశీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సోమ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే అంజిబాబుకు అభినందన

భీమవరం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):ప్రజాసేవలో అంకితభావంతో పనిచేసే వ్యక్తికే రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందని ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ అండ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అక్కినేని కృష్ణకిషోర్, వైస్ ప్రెసిడెంట్ ఎంఎల్ఎస్ఎన్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను భీమవరం క్యాంప్ కార్యాలయంలో అపుస్మా జిల్లా సభ్యులు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా సభ్యులు నరసింహరాజు, సెక్రటరీ వంశీ, కోశాధికారి ప్ర కాష్, పాలకొల్లు జోన్ ప్రెసిడెంట్ షాజహాన్, జాన్ రాజశేఖర్, శశాంక్, రామకృష్ణ, ఏడుకొండలు పాల్గొన్నారు.















స్వాములుకు భిక్షను వడ్డిస్తున్న దాతలు

## స్వాములకు భిక్ష అభినందనీయం

భీమవరం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా భీమవరంలో దీక్షలు చేపట్టిన స్వాములు, భవానీలకు చనమల్ల సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు పేరిట చనమల్ల చంద్రశేఖర్ రెండో సంవత్సరం కూడా భిక్ష చేపట్టడం అభినందనీయమని పలువురు అన్నారు. భీమవరం, గొల్లవానితిప్ప రోడ్‌లోని వారి నివాస సమీపంలో శనివారం దాత టంకాల సత్యనారాయణ (బాబి) వారి కుటుంబ సభ్యులు, ట్రస్టు సహకారంతో స్వాములకు భిక్ష నిర్వహించామని, కార్తీక మాసం చివరి రోజు అయిన డిసెంబర్ ఒకటో తేదీ, ఆదివారం సాయంత్రం పడిపూజ నిర్వహిస్తున్నామని, స్వాములు పెద్ద ఎత్తున పాల్గొనాలని చనమల్ల చంద్రశేఖర్ తెలిపారు.



## గోపిమూర్తిని గెలిపించాలి:జేవీవీ

పెనుమంట్ర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5వ తేదీన జరగనున్న ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపి మూర్తికి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా విభాగం విస్తృత ప్రచారం చేసింది. శనివారం పెనుమంట్ర మండలం పాలమూరు, మాముడూరు, జుత్తిగ, పెనుమంట్ర, ఆలమూరు మార్టేరు జిల్లా పరిషత్ హైస్కూల్లో టీచర్లను గోపి మూర్తిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా అధ్యక్షుడు చింతపల్లి ప్రసాదరావు మాట్లాడుతూ నిజాయితీగా ఉపాధ్యాయుల హక్కుల కోసం పాటుపడే గోపి మూర్తిని అన్నారు. జిల్లా కోశాధికారి ఎం శ్రీనివాస్ హెల్త్‌సబ్ కమిటీ కన్వీనర్ వై అజయ్ కుమార్ జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.


ప్రత్యేక దీపాలంకరణలో కాళ్ళకూరు శ్రీవారు

## కాళ్లకూరు వెంకన్నకు ఊంజల్ సేవ

కాళ్ళ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):కార్తీక మాసం ఆఖరి శనివారం కావడంతో కాళ్ళకూరులోని స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి స్వామి, అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, అష్టోత్తర శతనామార్చన, ఊంజల్ సేవ ఘనంగా జరిపారు. కలవపూడికి చెందిన మంతెన బాలవిశ్వనాథరాజు దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో ఎం అరుణ్‌కుమార్ ఏర్పాట్లు చేశారు.

## శివకేశవులకు గ్రామోత్సవం

పాలకోడేరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరులో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శివ కేశవులకు శనివారం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలోని వేణుగోపాలస్వామి, శివకేశవుల గుడి వద్ద శుక్రవారం శివయ్యకు 108కేజీలతో అన్నాభిషేకం కన్నయ్యకి 108 కేజీలతో వెన్నాభిషేకం నిర్వహించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా రెండో రోజు శనివారం శివకేశవులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో కేరళ వాయిద్య బృందాలతో దేవుళ్ళను గ్రామంలో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. దీంతో భక్తులు, మహిళలు, పురుషులు ఉత్సవంలో పాల్గొని సందడి చేశారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

## అదానీని అరెస్టు చేయాలని సీపీఎం ధర్నా

ఆకివీడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):ఆర్థిక నేరస్తుడు గౌతమ్ అదానీని వెంటనే అరెస్టు చేసి, ముడుపులందుకున్న వాళ్ళ నిగ్గు తేల్చాలని సీపీఎం డిమాండ్ చేసింది. శనివారం స్థానిక గాంధీజీ సెంటర్‌లో పట్టణ అధ్యక్షుడు కె.తవిటినాయుడు నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వం రూ.1750 కోట్లు తీసుకొని అదానితో చేసుకున్న ఒప్పందాలతో 25 ఏళ్ళపాటు ప్రజలపై విద్యుత్ భారాలను వేయక తప్పదన్నారు. నాయకులు పెంకి అప్పారావు, బీవీ వర్మ, గేదెల ధనుష్, పంపన వెంకటరమణ, కె.శ్రీనివాసరాజు, రాగాల రాము, ఎం.ప్రవీణ్ తదితరులు ఉన్నారు.


మొగల్తూరు కోట వద్ద నేల రాలిన చేను


నవాబుపాలెంలో టార్పాలిన్‌తో కప్పిన ధాన్యం


వెలవెలబోయిన పాలకొల్లు సంతమార్కెట్


తాడేపల్లిగూడెంలో తడిచి వెళ్తున్న వాహన చోదకులు

# వాయుగండం గడిచేనా..?

## పలు చోట్ల పూర్తికాని కోతలు
## వాన, గాలితో ఒరిగిన వరిచేలు
## మరికొన్ని చోట్ల కల్లాల్లోనే ధాన్యం రాశులు


పెంటపాడు మండలం దర్శిపర్రులో తడిచిన ధాన్యం బస్తాలు

**అరుగాలం కష్టించి పండించిన పంట దక్కే సమయానికి తుపాన్లు వచ్చి అన్నదాతను నష్టాలపాలు చేస్తున్నాయి. సార్వా ఆది నుంచీ అన్నదాతను పరీక్షిస్తూనే ఉంది. ఇప్పుడు ఫెంగల్ తుఫాన్ వణికిస్తోంది. దీని ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఇక్కడితో ఆగిపోతే అన్నదాతకు అంతగా నష్టం ఉండదు. కష్టం తొలగాలని అన్నదాత దేవుళ్లను మొక్కుకుంటున్నాడు.**

పెంటపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో శనివారం ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉంది. రైతులు కోత కోసుకున్న ధాన్యం ఇప్పటికీ చాలా మటుకు కల్లాలపైనే ఉంది. కొన్ని చోట్ల ధాన్యం ఒబ్బిడి చేసుకుని బస్తాలలో నింపిన తరువాత వర్షం వచ్చేయడం తో రైతులు ఉన్నచోటనే బరకాలు కప్పుకుని ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకున్నారు. అయినప్పటికి కొన్ని చోట్ల బస్తాలలో ఎక్కించుకున్న ధాన్యం వర్షానికి తడిచి పోయింది. మధ్యాహ్నం దాటిన తరువాత వర్షం కాసింత తెరిపివ్వడంతో బస్తాలలో ఎక్కించుకున్న ధాన్నాయి ట్రాక్టర్లపై సురక్షిత ప్రాంతాలకు చేర్చుకున్నారు.

**మొగల్తూరు:** ఈదురు గాలులకు మొగల్తూరు, రామన్నపాలెం గ్రామాల్లో కోతకు వచ్చిన వరి చేలు పలు చోట్ల నేలవాలాయి. శనివారం మధ్యాహ్నం నుండి వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోయింది. మొగల్తూరు పెద్ద గొల్లగూడెం ఆర్‌అండ్‌బీ రహదారి గోతుల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో స్థానికులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు రైతులు కోసిన వరి పనలను ఒబ్బిడి చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు కోసిన పనలను చేల్లో నుండి గట్టుకు చేర్చి బరకాలు కప్పుతున్నారు.

**ఆచంట:** వాయగుండం ప్రభావం వల్ల శనివారం ఆచంటలో ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉంది. మండలంలో జోరుగా సాగుతున్న సార్వా మాసూళ్ల తుఫాన్ కారణంతో మాసూళ్ళకు బ్రేక్‌పడింది. ఇప్పటి వరకు మాసూళ్ళు జరిగిన ధాన్యం చాలా వరకు రైతులు మిల్లులకు తోలినప్పటికి ఇంకా అనేక చోట్ల కల్లాల్లోనే ధాన్యం ఉంది. అయితే వర్షం కారణంగా ధాన్యం తడవకుండా రైతులు బరకాలు కప్పారు. ఈ సారి సార్వా మాసూళ్ళు ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా జరుగుతున్న తరుణంలో ఒక్కసారిగా ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కారణంగా పండిన పంట సైతం నేలకొరిగే ప్రమాదం ఉందని పలువురు రైతులు వాపోతున్నారు.

**అత్తిలి:** తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షంతో రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. మండలంలో 14500 ఎకరాలలో సార్వాసాగు చేపట్టారు. వరికోతలు ఇప్పుడిప్పుడే ఊపందుకున్నాయి. ఈ తరుణంలో తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడడంతో మాసూళ్లకు ఆటంకం ఏర్పడింది. వరికోత యంత్రాలతో నూర్పిడి చేసిన ధాన్యాన్ని రాశులు చేసి, టార్పాలిన్‌లు కప్పారు. తుఫాన్ ప్రభావంతో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతాంగం అప్రమత్తమైంది. దీంతో వరికోతలను రైతులు వాయిదా వేసుకున్నారు.

**ఇరగవరం:** వరి కోత దశలో ఉన్నందున భారీ వర్షం పడితే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం జల్లులు పడడంతో కోసిన ధాన్యాన్ని బరకాలు కప్పి రహదారులు, ఎత్తయిన ప్రాంతాల్లో .భద్రపరిచారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 17 శాతం లోపు తేమ ఉండాలి. ప్రస్తుతం జల్లులు పడడం, చలి కాలం కావడంతో తేమశాతం 26 నుంచి 28 వరకూ ఉంటుందని రైతులు చెబుతున్నారు. మండలంలో సాధారణ విస్తీర్ణం 13,341 ఎకరాలు కాగా 46 శాతం కోతలు పూర్తి అయ్యాయని ఇప్పటి వరకూ 10 వేలమెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి వై రాఘవేంద్రరావు తెలిపారు. మరో రెండు రోజులు వర్ష సూచన ఉన్నందున కోతలు ప్రారంభించవద్దని రైతులకు సూచిస్తున్నారు.

**తాడేపల్లిగూడెం రూరల్:** తుఫాన్ ప్రభావంతో తాడేపల్లిగూడెం, పరిసర ప్రాంతాల్లో వర్షం గంటన్నరపాటు దంచికొట్టింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. కాగా మండలంలో రైతులు చాలా వరకూ ధాన్యం ఒబ్బిడి చేసుకోగా ఆరుగొలను, నవాబుపాలెం, కృష్ణాయపాలెం, ఆరుళ్ల తదితర ప్రాంతాల్లో రైతులు తమ ధాన్యం తడవకుండా టార్పాలిన్లతో ధాన్యం రాశులను భద్రపరుచుకున్నారు.

**పాలకొల్లు అర్బన్:** తుఫాను కారణంగా శనివారం ఉదయం నుండి ఈదురుగాలులతో పాటు వర్షం కురుస్తూనే ఉంది. దీని వల్ల వారాంతంలో జరిగే సంత మార్కెట్‌లో వినియోగ దారులు తక్కువగా రావడంతో వ్యాపారులు డీలా పడ్డారు. గత వారం కన్నా కూరల ధరలు అన్నీ కిలోకి రూ.10లు పెరిగినట్టు వ్యాపారాలు చెబుతున్నారు. వరి రైతులకే కాకుండా కూరగాయల రైతులకు, వ్యాపారులకు కూడా తుఫాన్ నష్టాలను మిగిల్చింది.



పెంటపాడులో ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

### తేమ శాతం నిబంధన సడలించాలి

పెంటపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో తేమశాతం నిబంధన సడలించాలని రైతు సంఘం నాయకులు చిర్లా పుల్లారెడ్డి, సిరపరపు రంగారావు డిమాండ్ చేశారు. శనివారం పెంటపాడు ధాన్యం కల్లాల వద్ద వర్షంలో ధర్నా నిర్వహించారు. రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం వెంటనే విడుదల చేయాలని కోరారు. పెనగంటి దుర్గ, లంకలపల్లి అప్పారావు, వడ్డాని సన్యాసిరావు, జక్కంపూడి బంగార్రాజు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

### అత్తిలి మండలంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

అత్తిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించామని మండల వ్యవసాయ అధికారి టీకే రాజేష్ చెప్పారు. శనివారం వరకు 4,669 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు ఇప్పటి వరకు 98,150 అందుబాటులో ఉంచామన్నారు. రైతు సేవా కేంద్రంలో సంచులు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దళారులను నమ్మి తక్కువ ధరకు ధాన్యం విక్రయించవద్దని రైతు సేవా కేంద్రం ద్వారా మాత్రమే ధాన్యం విక్రయించి పూర్తి మద్దతు ధర పొందాలని కోరారు. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే రైతు సేవా కేంద్ర సిబ్బందిని లేదా తహసీల్దార్, మండల వ్యవసాయశాఖ అధికారిని లేదా కాల్ సెంటర్ 1967, 8121676653కు ఫోన్‌చేసి పూర్తి సమాచారం తెలుసుకోవాలన్నారు.

### ఆదికవి నన్నయ్య వర్సిటీలో ఫార్మసీ వారోత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని ఆదికవి నన్నయ్య వర్సిటీ ప్రాంగణంలో శనివారం ఫార్మసీ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ టి. అశోక్ మాట్లాడుతూ ఫార్మసీ ఆరోగ్య సంరక్షణలో గుండెవంటిదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వైద్య శిబిరం నిర్వహించి బ్లడ్‌గ్రూప్, బీఎంఐ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

### క్షీరారామంలో లక్షపత్రి పూజ

పాలకొల్లు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీక అమావాస్య సందర్భంగా స్థానిక క్షీరా రామలింగేశ్వర స్వామికి శనివారం స్థానిక శ్రీ గాయత్రీ పురోహిత సంఘం 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లక్షపత్రి పూజలు నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవార్లకు కుంకుమ పూజలు, రుద్రహోమం, లక్షపత్రి పూజలు, వేదాశీర్వాచనం వంటి కార్యక్రమాలను పండితులు నిర్వహించారు.

### నేడు హైకోర్టు జడ్జిల రాక

నరసాపురం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నరసాపురం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తెలగా కళ్యాణ మండపంలో నిర్వహించే దివంగత న్యాయవాది కొమండూరి శ్రీనివాస్ చిత్రపట అవిష్కరణ కార్యక్రమానికి హైకోర్టు జడ్జీలు విచ్చేస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు చేగొండి బాలాజీ, రంప పుల్లాజీలు చెప్పారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జీ చలమేశ్వర్, హైకోర్టు జడ్జీలు జస్టిస్ సురేష్ రెడ్డి, పురుషోత్తంకుమార్, ఏవీ శేషసాయిలతో పాటు ఏపీ బార్ కౌన్సిల్ అధ్యక్షులు చిదంబరం విచ్చేస్తున్నారన్నారు. కుమారుడు గంగరాజు మాట్లాడుతూ తన తండ్రి చిత్రపటాన్ని కోర్టులో ఆవిష్కరించడం ఆభినందనీయమన్నారు.

### నేడు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

పాలకొల్లు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆదివారం స్థానిక క్షత్రియ సంక్షేమ పరిషత్ కళ్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం, క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేసినట్టు స్థానిక కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి ఉచితంగా ప్రత్యేక బస్సులు నడపడం జరుగుతుందన్నారు. క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ అల్లూరి వంశీ కృష్ణ, చర్మ వ్యాధుల డాక్టర్ పియాంక వర్మ, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ వివిజె సోమరాజు (విశాఖ), కిడ్నీ సంబంధిత వ్యాధుల డాక్టర్ గౌతమ్‌కృష్ణ, నరాల వైద్య నిపుణులు డాక్టర్ ఉమేష్ బోనాల వైద్య పరీక్షలు చేస్తారని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### కాపు, అగ్నికుల క్షత్రియ వనసమారాధనలు వాయిదా

నరసాపురం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం లేసుపార్కు సమీపంలో ఆదివారం జరగాల్సిన కాపు కార్తీక వన సమారాధన తుఫాన్ కారణంగా వాయిదా వేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఇటు పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ గోదాము సమీపంలో జరగాల్సిన అగ్నికుల క్షత్రియ వన సమారాధనను కూడా వాయిదా వేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో ప్రకటిస్తామన్నారు.

### నేడు కాపు, బలిజ, తూర్పు కాపు సంఘం వన భోజనాలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 30 : ఆదివారం ఉదయం కాపు, బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద సాయి బాబాగుడి రోడ్డులో అడబాల గార్డెన్స్‌లో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేసినట్టు సంఘ నాయకులు తెలిపారు. అలాగే పట్టణ తూర్పు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలపల్లి బైపాస్ రోడ్డులోని అడబాల వెంకట రమణ లేఔట్ (తోట)లో వన సమా రాధన ఏర్పాటు చేసినట్టు సంఘ నాయకులు తెలిపారు.

### చట్టాలపై అవగాహన ఉండాలి

పాలకొల్లు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేన రోజా రమణి తెలిపారు. తన నివాసంలో శనివారం ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలను విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, పౌష్టికాహారం, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, ఆత్మరక్షణ, యోగ వంటి అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ అందించాలన్నారు.

## జిల్లాలో 92 శాతం పింఛన్ల పంపిణీ


నందమూరుకు చెందిన పింఛన్‌దారుడికి ఆసుపత్రిలోనే పింఛన్ అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌ల పంపిణీలో జిల్లాలోనే తాడేపల్లిగూడెం టాప్‌లో నిలిచింది. డిసెంబర్ 1 ఆదివారం కావడంతో పింఛన్ దారులు ఇబ్బంది పడకూడదని ప్రభుత్వ ఆదేశాలతో శనివారం తెల్లవారు జామునుంచే అధికారులు పింఛన్‌లు పంపిణీ చేశారు. జిల్లాలో 2లక్షల 28వేల 362 మంది పింఛన్ దారులకు సొమ్ము అందించాల్సి ఉండగా ఉదయం 10 గంటలకే 85 శాతం అందించారు. అధికారులే స్వయంగా ఇంటింటికి తిరిగి పింఛన్లు అందించారు. సాయంత్రానికి జిల్లా మొత్తం 92 శాతం పింఛన్లు అందించారు. అంటే 2.28 లక్షల మందిలో 2.12లక్షల మందికి పింఛన్‌లు అందించారు. తాడేపల్లిగూడెం మండలం 95.5శాతం పింఛన్‌లు అందించగా ఆ తరువాత తణుకు పట్టణం 94.24శాతం, ఇరగవరం 94.14 శాతం, అత్తిలి 94శాతం తాడేపల్లిగూడెం పట్టణం 94శాతం ఇలా పింఛన్‌ల పంపిణీలో ముందున్నాయి.

**మొగల్తూరు :** ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు 93 శాతం మంది లబ్ధిదారులకు అందించామని ఎంపీడీవో సిహెచ్. త్రిశూలపాణి శనివారం తెలిపారు. మండలంలోని 10,886 పింఛన్లకు గానూ 10,341 మందికి అందించామన్నారు. పింఛన్ అందుకోని వారికి 2వ తేదీ సోమవారం పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

## నియోజకవర్గ సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే బొలిశెట్టి



తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ విప్ పదవి చేపట్టిన సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టిని పెంటపాడు టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు దాసరి అప్పన్న, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు బండారు వెంకట్రావు, ఎస్సీ సెల్ నాయకుడు వాసు తదితరులు పాల్గొన్నారు.


వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచి సర్టిఫికెట్లు, బహుమతులు అందుకున్న డీఎన్‌ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

### ఎయిడ్స్ బాధితులు పౌష్టికాహారం తీసుకోవాలి

పాలకొల్లు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎన్‌ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్, రెడ్ రిబ్బన్, యునైటెడ్ కాపు వనిత క్లబ్‌లు ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ పి శోభారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అనుపమ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, ఎయిడ్స్ బాధితుల పట్ల సానుభూతి కలిగి ఉండాలని, ఎయిడ్స్ బారిన పడిన వారు భయపడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా విద్యార్థిను లకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి. రవి శంకర్, కాపు వనిత క్లబ్ నాయకులు విజయలక్ష్మీ, సభ్యులు పాల్గొన్నారు.


నాసా కిట్లు అందుకున్న విద్యార్థులు

### నాసా కిట్ల పంపిణీ

పెనుగొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచి బాగా చదువుకుని మంచి భవిష్యత్తును ఎంచుకోవాలని ఎస్‌డీకేపీ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సీహెచ్. ఆనంద్ కుమారి అన్నారు. పెనుగొండ శ్రీ చైతన్య టెక్నో స్కూలులో ప్రపంచ స్థాయి నేషనల్ స్పేస్ సొసైటీ వారు నిర్వహించే నాసా కాంటెస్ట్ 2025 కు ప్రాజెక్టు తయారీకి సంసిద్ధులైన శ్రీ చైతన్య విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమారి చేతుల మీదుగా విద్యార్థులకు నాసా కిట్లు అందజేశారు. నాసా స్పేస్ కాంటెస్ట్‌కి సంబంధించిన స్పేస్ కాలనీ అనే అంశం పై తయారు చేసి ప్రాజెక్టును నాసా సంస్థకు పంపించడం జరుగుతుందన్నారు.


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు

### గ్రామాల్లో సమస్యల పరిష్కరిద్దాం

మొగల్తూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కైలా సుబ్బారావు సూచించారు. శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ డి.మోహనరావు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ నిధులు రూ.7కోట్లుతో గ్రామాల్లో పైప్‌లైన్ విస్తరణ పనులు చేస్తున్నామన్నారు. మండలంలో మూడు భారీ మంచినీటి ప్రాజెక్టుల్లో మరమ్మత్తు పనులు పూర్తి చేశామని రానున్న రోజులు పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తామన్నారు. మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు కుళాయి కనెక్షన్‌లు లేవని అధికారుల దృష్టికి రాగా ఆయా కేంద్రాల్లో కుళాయి కనెక్షన్‌లు ఇస్తున్నట్టు తెలిపారు. మండల వ్యవసాయాదికారి అబ్దుల్ రహీమ్ మాట్లాడుతూ ఫెంగల్ తుఫాన్ కారణంగా రైతులు కోతకు వచ్చిన చేలు కోయవద్దని, నూర్పిన ధాన్యం తడవకుండా జాగర్తలు తీసుకోవాలని రైతులకు సూచించామన్నారు. రెండో వైస్ ఎంపీపీ కవురు సీతామహలక్ష్మీ, ఎంపీడీవో సిహెచ్ త్రిశూల పాణి, తహసీల్దార్ కె.రాజ్ కిషోర్, డిటి సంధ్య, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్ర

### ఆచంట ప్రభుత్వ ఐటీఐ అభివృద్ధికి కృషి

ఆచంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆచంట ప్రభుత్వ ఐటీఐ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంటు కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ వంక రవీంద్ర అన్నారు. శనివారం స్థానిక ఐటీఐలో ఐఎంసీ తొలి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కళాశాలకు రెండు ఎకరాల భూమి, కళాశాలలో సీట్లు పెంపునకు కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసేందుకు తీర్మానించారు. ఉపాధి శిక్షణ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ మధు శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు

### మనిషిని చిత్తుచేసే మత్తు

పాలకొల్లు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితాలను చిత్తుచేసేవి మత్తు పదార్థాలేనని, మత్తు పదార్థాలను వినియోగించడం మన జీవితాన్ని మనం నాశనం చేసుకున్నట్టేనని పాలకొల్లు ఎక్సైజ్ సిఐ మద్దాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఏఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం డ్రగ్స్ వినియోగం, పొగాకు వాడకం అన్న అంశంపై రసాయనశాస్త్రం విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగటా ప్రసంగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ రాజేశ్వరి మాట్లాడుతూ తమ కళాశాలకు ఎన్‌సిసి నావల్ యూనిట్ మంజూరు అయిందని తెలిపారు.

**తాడేపల్లిగూడెం రూరల్:** మత్తు మనిషిని చిత్తు చేస్తుందని అలాంటి మత్తుకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ వి కళ్యాణ చక్రవర్తి సూచించారు. తాడేపల్లిగూడెంలోని ఆదిత్యా కళాశాల విద్యార్థులకు శనివారం మత్తుపదార్థాల వినియోగం, వాటి పర్యవసానాలపై అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఎస్సైలు మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

### వరాల వెంకన్నను దర్శించుకున్న భక్తులు

అత్తిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి మండలం ఈడూరులోని వరాల వేంకటేశ్వరస్వామిని కార్తీక మాసం చివరి శనివారం కావడంతో అదిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, తోమాల సేవ, విశేష అర్చనలు జరిపారు. భక్తులకు ఆలయ కమిటీ సహకారంతో అన్నదానం జరిపారు. అత్తిలి రైల్వేస్టేషన్ రోడ్డులో గల బాలాజీ వేంకటేశ్వరస్వామిని కార్తీక మాసం చివరి శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



### దళితులు అన్నిరంగాల్లో ఎదగాలి

నరసాపురం రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దళితులంతా సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా మరింత ఎదగాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని సీతారాపురంలో మాలల పోరాట సమితి ఆధ్వర్యంలో సోడదాసి శ్రీధర్ అధ్యక్షతన నియోజకవర్గ దళితుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులంతా ఐక్యమత్యంతో ఉండి అంబేడ్కర్ అందించిన రాజ్యాంగాన్ని అందిపుచ్చుకోవా లన్నారు. అమలాపురం ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామన్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడు తూ ఇతర కులాల మాదిరిగానే దళితులంతా ఐక్యంగా ఉండాలన్నారు. అనంతరం ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కమిటీని ఏర్పాటు చేశారు. కొత్త కమిటీని దళిత సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, మంగరాజు, ఎంపీపీ సోని తదితరులు పాల్గొన్నారు.



### సమగ్ర కులగణన జరగాలి

తణుకు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జన గణనలో సమగ్ర కుల గణన జరగాలని బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాసు డిమాండ్ చేశారు. శనివారం తణుకు ఆంజనేయస్వామి ఆలయం వద్ద రాష్ట్ర బీసీ నాయకుడు తమరాపు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చెప్పారు. తణుకు పట్టణానికి చెందిన బీసీ చైతన్య వేదిక జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కొలగాని కృష్ణవేణిని నియమించినట్లు శ్రీనివాసు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్యాగరాజు, తమరాపు రమణమ్మ, కట్టా అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

### గోపిమూర్తి విజయానికి ప్రచారం

మొగల్తూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బి.గోపి మూర్తి గెలుపును కోరుతూ శనివారం యూటీఎఫ్ కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. మండలంలోని 16 మంది యూటీఎఫ్ కార్యకర్తలు 10 ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు నమూనా బ్యాలెట్‌లు అందించి విజయాన్ని చేకూర్చాలని కోరారు.



### కేంద్ర మంత్రి వర్మకు ఎమ్మెల్యే ఆరిమిల్లి పరామర్శ

తణుకు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కృష్ణతులసితో పాటు కుటుంబ సభ్యులు శనివారం పరామర్శించారు. భీమవరంలోని ఆయన నివాసంలో సూర్యనారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తండ్రి సూర్యనారాయణరాజు ఆసుపత్రిలో ఉన్నప్పటికి, మరోపక్క మంత్రి బాధ్యతలను నిర్వహించారన్నారు. కుటుంబీకుకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

### శ్రీవారికి ప్రత్యేక పూజలు



మొగల్తూరు, నవంబరు 30: కార్తీక మాసం ఆఖరి శనివారం కావడంతో మొగల్తూరు దయాల్‌దాస్‌పేటలోని భూసమేత కలియుగ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జాము నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ధ్వజస్తంభం వద్ద దీపాలు వదిలారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు గంగా పవన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కొత్తోటలోని బాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

### కాళ్ళకూరు వెంకన్నకు ఊంజల్ సేవ

కాళ్ళ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ఆఖరి శనివారం కావడంతో కాళ్ళకూరులోని స్వయంభూః శ్రీవేంకటేశ్వరస్వామి స్వామి, అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, అష్టోత్తర శతనామార్చన, ఊంజల్ సేవ ఘనంగా జరిపారు. కలవపూడి గ్రామానికి చెందిన మంతెన బాలవిశ్వనాథరాజు దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు.